
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 30 అక్టోబరు 2025


కొల్లూరు : గాలులకు పడిపోయిన వరిని చూపుతున్న రైతు


నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే వేగేశన


సూర్యలంకరోడ్డులో కుందేరువాగు చప్టాపై పొంగి పొర్లుతున్న వర్షపు నీరు

బాపట్ల : కొల్లూరు-వేమూరు మధ్య పొలాల్లో నేల వాలిన వరి



మొంథా బీభత్సం


కొల్లూరు : గాలులకు కూలిన అరటి తోట


కొల్లూరు : ఉరకెత్తిన పసుపు


నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచిక

ముంచేసింది

- వరి, మినుము, పత్తిపై తీవ్ర ప్రభావం
- అంధకారంలో తీరం.. భయంగుప్పెట్లో ప్రజలు


రావి అనంతవరంలో వేణుగోపాల స్వామి దేవాలయంలో గాలులకు కూలిన ధ్వజ స్థంభం

(బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి, మార్టూరు, బల్లికురవ, ఆంధ్రజ్యోతి)

వాతావరణ శాఖ అంచనాలకు మించి తుఫాన్ జిల్లాపై తీవ్రప్రభావం చూపింది. భీకరమైన ఈదురుగాలులకు భారీ వర్షం కూడా తోడయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దాదాపు పది గంటల పాటు కురిసిన వర్షం రైతులను ముంచేసింది. దిగుబడుల వేళ తుఫాన్ విరుచుకుపడి పొలాలను కబళించేసింది. తీరప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన భారీవర్షంతో చెట్లు, విద్యుత్‌స్థంభాలు తెగిపడి కూలాయి. దీంతో పలు ప్రాంతాల్లో అంధకారంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ తెల్లవారేంతవరకు తీరప్రాంత ప్రజలు కునుకులేకుండా గడిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి 9 గంటల నుంచి నిలిపివేసిన కరెంటును బుధవారం ఉదయానికి పునరుద్ధరించారు. జిల్లాలో 81 కరెంటు స్థంభాలు నేల కొరగగా వీటిలో 70 పోల్స్‌ను బుధవారం ఉదయానికే పునరుద్ధరించారు. జిల్లాలో 119 చెట్లు నేలకొరగా వాటిని అధికారులు తొలగించారు. పర్చూరును వరద నీరు ముంచెత్తడంతో స్పందించిన కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అక్కడకు చేరుకుని జాతీయ రహదారిపై ఉప్పుటూరు సమీపంలో రోడ్డును పగలకొట్టి నీటిని దిగువకు మళ్లించడంతో ముప్పు తప్పింది. వాడరేవు - రామాపురం మార్గమధ్యలో వంతెనలు కూలిపోగా ఎస్పీ ఉమామహేశ్వర్ బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేయించారు. భారీ వర్షాల ప్రభావం బల్లికురవ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలపై తీవ్రంగా పడింది. క్వారీల్లో వర్షపు నీరు చేరింది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారమే 82,500 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తేలింది. వరి 66,033 ఎకరాలు, మినుము 4,564 మొక్కజొన్న 2,472, పత్తి 2,190 ఎకరాలుగా తేలింది. మార్టూరు మండలం కోలలపూడి గ్రామంలో తుఫాన్ దెబ్బకు బొప్పాయి తోటలు నేలకూలాయి. జిల్లావ్యాప్తంగా 203 పునరావాస కేంద్రాల్లో 10,084 మంది ఆశ్రయం పొందుతున్నారు.

పొంగిన సముద్రం.. 300 ఎకరాలు మునక

తుఫాన్ ప్రభావంతో సముద్రపు నీరు పొంగింది. దీంతో రేపల్లె మండలం లంకేవానిదిబ్బ గ్రామంలో 300 ఎకరాలు మునిగిపోయి. ఉప్పునీటితో పంటంత పోయినట్లేనని రైతులు వాపోయారు.

మొంథా ముంచేసింది.

వాతావరణశాఖ హెచ్చరించినట్లుగానే బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి గాలుల తీవ్రత పెరుగుతూ వచ్చినా, రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వీచిన పెనుగాలులు, వర్షం బీభత్సాన్ని సృష్టించింది. కొన్ని ప్రాంతాల్లో కుండ పోత వర్షం కురిసింది. ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. భారీగా కురిసిన వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా రహదారులపై ప్రవహించాయి. పొలాలు చెరువులను తలపించాయి. చేతికి అందివచ్చిన పంటలు చాలావరకు ముంపునకు గురయ్యాయి. మంగళవారమే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించగా బుధవారం వారంతా అక్కడే ఆశ్రయం పొందారు. ఇక మునిగిన పొలాలను, పునరావాస కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. బుధవారం వర్షంలోనే ఎక్కడికక్కడ నేలకూలిన చెట్లను తొలగించి రాకపోకలను అధికారులు పునరుద్ధరించారు. దీంతో పాటు విద్యుత్ స్తంభాలను నిలబెట్టి కరెంట్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు.


రైతుల వెన్ను విరిచిన తుఫాన్

- పలు ప్రాంతాల్లో అత్యంత భారీగా వర్షం
- రహదారులపై ఉధృతంగా ప్రవహించిన వాగులు
- గాలులకు పడిపోయిన వృక్షాలు, కరెంటు స్తంభాలు
- వర్షంలోనూ సహాయక చర్యల్లో అధికార యత్రాంగం
- పునరావాస కేంద్రాల్లో వందలాది కుటుంబాలకు ఆశ్రయం
- నిజాంపట్నం హార్బర్‌లో కొనసాగుతున్న 3వ ప్రమాద హెచ్చరిక


కొల్లూరు వద్ద వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు


వేమూరు : జంపని వద్ద నేలకొరిగిన వరి

నరసరావుపేట, గుంటూరు సిటీ, బాపట్ల, తెనాలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలపై విరుచుకుపడింది. మంగళవారం రాత్రి పెనుగాలులతో బీభత్సం సృష్టించిగా.. బుధవారం భారీ నుంచి అతిభారీగా వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతవాసులు రాత్రంతా చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. మూడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలుల ధాటికి ఖరీఫ్ రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. చేలన్నీ చాపలా నేలపై పరుచుకుపోతే, అటు లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలకు తీరని నష్టం ఏర్పడింది. గెలలుచేతికొచ్చే తరుణంలో అరటి చెట్లు విరిగిపడటంతో రైతు వెన్ను విరిగింది. తమలపాకు, బొప్పాయి, కూరగాయల తోటల రైతులకూ భారీ నష్టం ఏర్పడింది. కంకులు వచ్చి, పచ్చని రంగులో వరి కళకళలాడుతుంటే తుపాన్ వరి రైతు ఆశలపై నీళ్లు చల్లింది. పశ్చిమ డెల్టాలో 5.71 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ కింద వరి సాగవుతుంటే బాపట్ల జిల్లాలో 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,84,190 ఎకరాలు సాగులో ఉంది. అయితే బాపట్ల జిల్లాలో 40 శాతం, గుంటూరు జిల్లాలో 20 శాతానికిపైగా పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షానికంటే గాలులకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. చాపలా పరచుకున్న చేలు ఎక్కడ చూసినా పడమర నుంచి తూర్పుకు వాలిపోయి కనిపించాయి. మరి కొన్ని చేలల్లో సుడిగాలులు వీచినట్లు వరి చిందరబందరగా పడిపోయింది. గింజ కూడా దక్కకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లకు, (మిగతా 6వ పేజీలో)


రేపల్లె : లంకెవానిదిబ్బ గ్రామంలో ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు


కలెక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో ఉప్పుటూరు వద్ద హైవేను పగల కొట్టి దిగువకు వరద నీటి మళ్లింపు

ఫోన్ కాల్స్‌తో ఆరా..

హలో.. మేము ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉందికదా! మీరు సురక్షితంగా ఉన్నారా? మీ ప్రాంతం లో పునరావాస కేంద్రాలలో సక్రమంగా సేవలందుతున్నాయా? అధికారులు అంతా అందుబాటులో ఉన్నారా? మీకు ఏదైనా ఇబ్బంది అని సహాయం కోరితే వెంటనే స్పందిస్తున్నారా? అంటూ ఫోన్ కాల్స్‌తో బాధితులను ఆరాతీశారు. మరోపక్క పోలీస్ సిబ్బంది కూడా 100 నంబరు నుంచి ఐవీఆర్‌ఎస్ ద్వారా ఫోన్ కాల్స్‌తో బాధితుల రక్షణపై ప్రశ్నించారు.


సముద్రం పొంగటంతో లంకెవానిదిబ్బలో నీటమునిగిన వరి పొలాలు

ఇద్దరు వృద్ధులు మృతి..

పలువురిని కాపాడిని యంత్రాంగం

తుఫాన్ సృష్టించిన విలయంలో జిల్లాలో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. చలిగాలులు తాళలేక అద్దంకిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన వనపర్తి హనుమంతరావు(80), రేక్‌నార్ లక్ష్మి(55) మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. గుండ్లకమ్మ వరదలో అద్దంకిలోని పంపింగ్ స్కీమ్ వద్ద విధులు నిర్వహించే ముగ్గురు సిబ్బంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు జాలర్లు మున్సిపల్ సిబ్బందిని పడవపై ఎక్కించుకుని వస్తుండగా బోల్తా పడటంతో ఆరుగురు వరదలో చిక్కుపోగా అప్రమత్తమైన అధికారులు వారిని రక్షించారు. ఇంకొల్లు మండలం కొణికిపల్లెకు చెందిన టి.కీర్తి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వరద నీటిలో 108 అక్కడకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఎస్ఐ సురేష్ తన వాహ నంలో ఆమెను ఇంకొల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఆదుకుంటాం.. అధైర్యపడొద్దు

ముంపు ప్రాంతాల పర్యనటలో మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవి

బాపట్లరూరల్, కొల్లూరు, వేమూరు, చీరాల : తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం చీరాల, బాపట్ల, కొల్లూరు, వేమూరు, మండలాల్లో మంత్రులు పర్యటించారు. అడవిపల్లెపాలెం గ్రామంలో మత్స్యకార కుటుంబాలకు గృహాలను మంజూరు చేస్తామ న్నారు. జంపని, కొల్లూరులోని పునరావాస కేంద్రాల్లోని బాధితులను పరామర్శించారు. చీరాల - పర్చూరు మార్గంలోని రొంపేరు కుడి కాల్వను మంత్రి పార్థసారథి కలెక్టర్ డా.వినోద్‌కుమార్‌తో కలిసి పరిశీ లిం చారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రతీ రైతుకు నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పంట నష్టాలను అంచనాలకి అధికార బృందాలను పంపిస్తామన్నారు. 36 గంటల ముందు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ ద్వారా పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేసినందునే ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. మంత్రుల వెంట ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్ర వర్మ, నక్కా ఆనందబాబు, కొండయ్యలతో పాటు స్థానిక నేతలు, అధికారులు ఉన్నారు.


బాపట్ల : పాండురంగాపురంలో మిరప కాయలను రోడ్డుపై అరబోసిన రైతు


పేరలిపాడులో పాక పడిపోవడంతో మృతి చెందిన పశువులు


మార్టూరు : కోలలపూడిలో నేలకొరిగిన బొప్పాయి తోట


చీరాల : అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్


చీరాల రామాపురం మార్గంలో కూలిన వంతెన


వాడరేవులో పర్యటిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే కొండయ్య


రామాపురం రిసార్ట్స్ సమీపంలో కూలిన రెండో వంతెన

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం


జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, సీఈఓ జ్యోతిబసు

- ప్రకటించిన వైసీపీ జడ్పీటీసీలు
- ఎంపీపీలను దించుతున్నందుకు ప్రతీకారం
- కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


అవిశ్వాసం పెడతామని ప్రకటిస్తున్న వైసీపీ జడ్పీటీసీలు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

'మేము జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం పెట్టబోతున్నాం. అలా అని మాకు చైర్‌పర్సన్‌తో గొడవలు లేవు. ముప్పాళ్ల, మాచర్ల ఇతర మండలాల్లో వాళ్లకి (కూటమి) ఒక్క సీటు కూడా లేకుండానే పదవిలో ఉన్న వారిని దించేందుకు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. కిడ్నాప్‌లు చేస్తున్నారు.. కేసులు పెడుతున్నారు.. ఏమి చేయాలో అన్నీ చేస్తున్నారు. అందుకని మేము కూడా జడ్పీ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని అనుకుంటున్నాం. ఎప్పుడూ.. ఎలా అనేది మరలా చెబుతాం.' అని వైసీపీకి చెందిన రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తదితరులు పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడిన అనంతరం వైసీపీ (మిగతా 6వ పేజీలో)

ఎలక్ట్రీషియన్లకు జర్మన్‌లో ఉద్యోగ అవకాశాలు

గుంటూరు, అక్టోబరు 29: జర్మనీలో ఎలక్ట్రీషియన్లకు ఉద్యోగాలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓం కాపీస్ (ఓఎం సీఏపీఐఈఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ఐటీఐ, డిప్లొమా విద్యా అర్హతతో 18 నుంచి 30 ఏళ్ల మధ్య గల పురుష అభ్యర్థులు జర్మనీలో పనిచేయడానికి వచ్చే నెల 2వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. జీతం నెలకు 2,600 నుంచి 2,700 యూరోలు (సుమారు రూ.2.5 నుంచి 2.7 లక్షలు) ఉంటుందన్నారు. రెండేళ్ల కాంట్రాక్ట్ ఉంటుందని వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' విజేతలు వీరే..

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన 'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా రామ్‌శేషు (నెల్లూరు), సునీల్ (అమలాపురం), సరసి(హైదరాబాదు) నిలిచినట్టు పేర్కొన్నారు. ప్రముఖ కార్టూనిస్టు హరి మాట్లాడుతూ విజేతలకు ప్రపంచ తెలుగు మహా సభల ప్రధాన వేదికపై బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. ఎంపికైన కార్టూన్లను వేదిక వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు.

నేడు తుళ్లూరు సీఆర్డీఏలో జాబ్ మేళా

తుళ్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏపీ సీఆర్డీఏ సౌజన్యంతో గురువారం ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనుంది. జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సిఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు లేదా శ్రీకర్ 99634 25999 నంబరుకు కాల్ చేయవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు నైపుణ్యం పోర్టల్ నమోదు చేసుకొవాలని సీఆర్డీఏ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది.

రాజధాని రైతుల ప్లాట్లపై అసత్యప్రచారం

● తుది దశకు చేరుకున్న ప్రక్రియ: మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి సచివాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. నాలుగు నెలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు 29644 మంది రైతులకు సంబంధించిన 34192.19 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఇంకా 991 మంది రైతులకు 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయించాల్సి ఉందన్నారు. 69421 ప్లాట్లకు 60980 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీటిలో కోర్టు కేసుల్లో 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు, ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందినవి 1170 ప్లాట్లు, వివాదాల్లో 450 మందికి చెందినవి 1889 ప్లాట్లు, పీవోటీ కేసుల్లో 78 మంది రైతులుకు చెందినవి 208 మంది పాట్లు, దేవదాయశాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందినవి 69 ప్లాట్లు, లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందినవి 337 ప్లాట్లు, ఎన్‌ఆర్‌ఐలు 210 మందికి చెందినవి 444 ప్లాట్లు ఉన్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 231.03 కోట్ల కౌలు చెల్లించామన్నారు. 484 మంది రైతులకు రూ.3.15 కోట్లు వివిధ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

● తీర ప్రాంతాల్లోనూ కొనసాగుతోన్న పనులు
● సత్ఫలితాలనిచ్చిన ముందస్తు ప్రణాళికలు
● క్షేత్రస్థాయిలో పర్యటించిన టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్



గుంటూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రేపల్లెలో సమీక్షిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఎక్కడికక్కడ నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుంటూరుతో పాటు పల్నాడు, బాపట్ల సర్కిల్స్ పరిధిలో ఓ అండ్ ఎం అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సక్సెస్ అయ్యారు. మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పవచ్చు. తుఫాన్ ప్రభావంతో భారీ వృక్షాలు, విద్యుత్ పోల్స్, తీగెలు తెగిపడిపోతే వెంటనే పునరుద్ధరించేందుకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ముందస్తు ఏర్పాట్లు చేశారు. అవసరమైన ప్రొక్లెయినర్లు, వాహనాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్‌లు, ఇతర సామగ్రిని స్టోర్స్‌లో అందుబాటులో ఉంచుకున్నారు. ఎటువంటి విపత్తులు సంభవించినా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబరు 1912తో పాటు గుంటూరు, పల్నాడు, సీఆర్‌డీఏ, బాపట్ల సర్కిల్స్‌లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు.

తెగిపడిపోయిన తీగెలు, కూలిన వృక్షాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు పెద్ద ఎత్తున వీచాయి. జిల్లా కేంద్రం గుంటూరులో పెద్దగా తుఫాన్ ప్రభావం చూపనప్పటికీ రూరల్ ప్రాంతాల్లో ముఖ్యంగా బాపట్ల సర్కిల్, పల్నాడు సర్కిల్స్‌లో ప్రభావం చూపింది. దాంతో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, రేపల్లె, కొల్లూరు, కొల్లిపర మండలాలతో పాటు లంక గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడం, వృక్షాలు నేలకూలటంతో విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. అలానే పల్నాడు సర్కిల్ పరిధిలోని సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట, ముప్పాళ్ళ మండలం, రెంటచింతల, మాచవరం వంటి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. ఇక సీఆర్డీఏ పరిధిలోనూ అక్కడక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తాయి. క్షేత్రస్థాయిలో ఓఅండ్ఎం సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగానే విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు అధికారులు తెలియజేశారు. బాపట్ల, పల్నాడు సర్కిల్స్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ అధికారుల బృందంతో పర్యటించారు. ప్రధానంగా బాపట్ల సర్కిల్ పరిధిలోని రేపల్లె మండల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ పునరుద్ధరణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఒక వైపు జాగ్రత్తలు పాటిస్తూనే విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా గుంటూరు నుంచి కూడా ప్రత్యేక అధికారులను బాపట్ల సర్కిల్ పరిధిలోని లంక ప్రాంతాలకు కేటాయించారు. మొత్తానికి తుఫాన్ నష్టంపై ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఎన్ని పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతిన్నాయి, ఎంత నష్టం జరిగిందనే దానిపై ఆరా తీస్తున్నారు.

తెలంగాణ జాలరిని రక్షించిన బెల్లంకొండ పోలీసులు

బెల్లంకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో కృష్ణా నదిలో చేపలు వేటకు వెళ్లకూడదని అధికారులు హెచ్చరించినా.. వినకుండా వెళ్లిన జాలరిని పోలీసులు బుధవారం రక్షించారు. వివరాల్లోకి వెళితే తెలంగాణలోని సూర్యపేట జిల్లా, చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పరసగాని శ్రీను మిషన్ బోటు వేసుకొని తన స్నేహితులతో కలసి చేపల వేటకు మంగళవారం రాత్రి కృష్ణా నదిలోకి వెళ్లాడు. వేట కొనసాగిస్తుండగా మిషన్ చెడి పోవడంతో బోటు స్టార్ట్ కాలేదు. తుఫాన్ అధికం కావడంతో.. ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో బుధవారం ఉదయం తోటి జాలర్ల సమాచారం మేరకు తెలంగాణ పోలీసులు పల్నాడు జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. సత్తెనపల్లి డీఎస్పీ ఆదేశాల మేరకు బెల్లంకొండ పోలీసులు సత్తెనపల్లి ఆర్డీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో స్థానిక జాలర్ల సహకారంతో శ్రీను ఉన్న చోటును గమనించి అతన్ని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ బెల్లంకొండ పోలీసులకు అభినందనలు తెలిపారు.



జాలర్‌ను సురక్షితంగా తీసుకు వచ్చిన పోలీసులు

మొంథా తుఫాన్ గట్టెక్కాం : జేసీ

రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రమాదకరమైన ఘటనలు జరగలేదని, ప్రజలు ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదని జాయింట్ కలెక్టర్ భావన అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. రేపల్లె ప్రాంతంలో ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలవాలటం గృహాల చుట్టూ నీరు చేరటం తప్పా ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితి లేదన్నారు. ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మండలంలోని పెనుమూడి పునరావస కేంద్రాన్ని ఆమె సందర్శించి బాధితులను పరామర్శించారు. ఆర్డీఓ రామలక్ష్మి, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ భావన

మొంథా బీభత్సం

(5వ పేజీ తరువాయి)

వాగులకు దగ్గరా ఉన్న చేలల్లో అయితే నేలవాలిన వరిపై నుంచి నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లోని నీటిని బయటకు తియ్యడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా యంత్రాంగం

ఓ పక్క తుపాన్ ధాటికి పెనుగాలులు విరుచుకుపడుతుంటే, మరోపక్క చిమ్మచీకటి. వర్షం.. అయినా రోడ్లకు అడ్డుగా విరిగిపడిన చెట్లు, విద్యుత్తు లు స్తంభాలను తొలగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. చెట్లను పడినట్టే క్షణాల్లో కత్తిరించి పక్కకు తొలగించేశారు. విద్యుత్తు స్తంభాలను పక్కకు నెట్టేసి, అవకాశం ఉన్న వరకు తెగిన తీగలను సరిచేస్తూ రాత్రంతా శ్రమించారు. మరోపక్క పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాతో పాటు భోజనం, అల్పాహారం అందించారు. ఆరోగ్య సిబ్బంది ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. విద్యుత్ శాఖ ముందే చెట్లను నరికేయడంతో చాలావరకు నష్టం తప్పింది. ప్రధాన లైన్లు దెబ్బతినడంతో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు 24 గంటల సమయం పట్టింది. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. బుధవారం ఉదయం నుంచి తుపాన్ తీవ్రత తగ్గడం, గాలులు శాంతించాయి. దీంతో హార్బర్‌లో హెచ్చరిక తీవ్రతను తగ్గించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా కొన్నిచోట్ల చిరుగాలులు, వర్షం కొనసాగుతుండటం, వాతారణంలో పూర్తిగా మార్పులు రాకపోవడంతో తిరిగి 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

పెరుగుతున్న వరద ఉధృతి

- బ్యారేజి నుంచి దిగువకు 82,675 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 96,490 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 10.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతోందని, డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేశామని ఆయన చెప్పారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో బుధవారం అధికారులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నాలుగు క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,845 క్యూసెక్కులు, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,232 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 65,077 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 3,97,077 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

1.0926 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన రెండు యూనిట్ల ద్వారా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0926 ఎంయూల కరెంట్ తయారైనట్లు ఎస్‌ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్ల మేర ఎత్తి 39,776 క్యూసెక్కులు, టేల్‌రేస్ చానల్ ద్వారా 7,157 క్యూసెక్కులు మొత్తం 46,933 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 46 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.



4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న కారణంగా ప్రతీకారం తీర్చుకునేందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించ బోతున్నట్లు వెల్లడించారు. తమకు 42 మంది సభ్యుల మద్దతు ఉందని ప్రకటించారు. పదవీ కాలం కేవలం 11 నెలలు మాత్రమే ఉందని, అంత తక్కువ సమయంలో పదవి మారినా..తాము ఏమీ చేయలేమన్న సంగతి కూడా తెలుసు నని వారు పేర్కొనడం గమనార్హం.

అంతా బాగుంటే కలెక్టర్‌ను కలవాలని

మొంథా తుపాను కారణంగా వైసీపీ జడ్పీటీసీల వ్యూహం దెబ్బ తిన్నట్లు తెలుస్తోంది. వాతావరణం బాగుంటే.. సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత వైసీపీ జడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన లేఖను అందజేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల క్రితమే కొందరు లీక్ చేశారు. తుపాను ఆటంకంతో వైసీపీ జడ్పీటీసీల ప్రణాళిక పారలేదు. జడ్పీలో 54 మంది జడ్పీటీసీలున్నారు. ఎన్నికలకు ముందు 12 మంది సభ్యులు టీడీపీ లో చేరారు. ఒక వేళ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం ప్రతిపాదించాలంటే రెండింట మూడొంతుల మంది సంతకాలు చేయాలి. వైసీపీ జడ్పీటీసీలు చెబుతున్నట్లుగా గతంలో 42 మంది మద్దతు ఉండేది కానీ, ఈ మధ్య పూర్తి స్థాయిలో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరో 15 మంది సభ్యులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ చెబుతున్నట్లు అవిశ్వాసం సంగతి మొదలు పెట్టకుండానే నవ్వులు పాలు కావచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

సమావేశంపై మొంథా ప్రభావం

జడ్పీ సర్వసభ్య సమావేశంపై మొంథా తుఫాన్ ప్రభావం పడింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు సమావేశం ఆరంభం కాగా ఆ సమయానికి రొంపిచర్ల జడ్పీటీసీ ఓబులరెడ్డి ఒక్కరే హాజరయ్యారు. ఉదయం 11.30 గంటలకు తాటికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, బొల్లాపల్లి జడ్పీటీసీ సీఆర్ బీబిభాయ్, పెదనందిపాడు జడ్పీటీసీ కె.అన్నపూర్ణమ్మ, తెనాలి జడ్పీటీసీ ఉమా ప్రణతి, కో-ఆప్షన్ సభ్యుడు జోస్సేనోమ్ మాత్రమే వచ్చారు. కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటించారు. త్వరలోనే సమావేశం తేదీని ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, పల్నాడు డీఆర్‌ఓ మురళి, వివిధ జిల్లాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి), నరసరావుపేట, రొంపిచర్ల, వినుకొండ ప్రాంతాల్లో దారి దోపిడీలకు పాల్పడిన కేసు లో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నరసరావు పేట డీఎస్పీ ఎం.హనుమంత రావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులు పట్టణంలోని చీకటి కాలనీకి చెందిన దేవరకొండ భవాని ప్రసాద్, వరవకట్టకు చెందిన షేక్ సుభాని, ఎస్ ఆర్‌కేటీ కాలనీ చెందిన గుంజి శ్రీను, కోట సెంటర్‌కు చెందిన రావుట్ల పవన్ సాయి అలియాస్ పండు, కోసూరుకు చెందిన రంజాన్‌వలి, అచ్చంపేటకు చెందిన సమీర్ ఒక గ్రూపుగా ఏర్పడి ఈ నెల 23, 27వ తేదీలలో పలు దారి దోపిడీలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. 23న నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై.. నర్సరావుపేట నుంచి శావల్యాపురం వైపు వెళ్లి అక్కడ ఓ వ్యక్తి బైక్ ఆపి కొట్టి బంగారు ఉంగరం, సెల్‌ఫోను తీసుకెళ్లినట్లు చెప్పారు. అదే రోజు రొంపిచర్ల వైపు వచ్చి వడ్లమూరివారి పాలెం రోడ్డులో మరో వ్యక్తిని అలాగే బెదిరించి.. రూ వెయ్యి నగదు, సెల్ ఫోను దోచుకున్నారన్నారు. 27న వినుకొండ, రొంపిచర్ల మార్గాల్లో దారి దోపిడీలకు పాల్పడ్డారని తెలిపారు. కర్లకుంట గ్రామం రోడ్డులో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలు ఆపి.. రూ.1000 నగదు, మెడలోని మంగళసూత్రం లాక్కెళ్లారని చెప్పారు. రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామానికి చెందిన బుట్టి సాంబశివరావు పోలీసులకు ఫిర్యాదుతో.. నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో మంగళవారం నిందితులను.. రొంపిచర్ల మండలం సుబ్బయ్యపా లెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రూరల్ సీఐ రామకృష్ణ, రొంపిచర్ల ఎస్సై.. నిందితుల నుంచి బంగారు ఉంగరం, రూ.4 500 నగదు, మూడు స్మార్ట్ ఫోన్లు, మంగళసూత్రంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

త్రికోటేశ్వరస్వామి దేవస్థానం.. ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నియామకాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చట్టానికి లోబడి ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల హిందు అభ్యర్థులు ప్రకటన తేది నుంచి 20 రోజులులోగా దరకాస్తు చేసుకోవాలని తెలిపారు.

సర్వే ద్వారా వాస్తవ సమాచారం సేకరించాలి

రైతులకు హామీ ఇచ్చిన మంత్రి పార్థసారథి



జంపనిలో బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, కొల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నష్టాల పై సర్వే ద్వారా వాస్తవ సమాచారం సేకరించాలని మంత్రి పార్థ సారథి అధికారులను ఆదేశించా రు. బుధవారం మండలంలోని జంపని, వేమూరు గ్రామాలలో మంత్రి పర్యటించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆయనకు ఈ ప్రాంతంలో జరిగిన పంటల నష్టాన్ని వివరించారు. మంత్రి ముందుగా జంపనిలో దెబ్బతిన్న పైర్లను పరిశీలించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జంపని, పోతుమర్రు గ్రామాలకు చెందిన 150 మంది నివాసితులతో తుఫాన్ ప్రభావం వలన కలిగిన ఇబ్బందిని నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల ద్వారా 2000 మందికి పునరావాసం కల్పించడంతో పాటు భోజన సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసినట్లు ప్రత్యేక అధికారి నాగిరెడ్డి తెలిపారు. అనంతరం మంత్రి అధికారులతో మాట్లాడుతూ ఆదేశాలు రాగానే గ్రామాల్లో సర్వే చేసి ఎక్కడైనా పడిపోయిన ఇండ్లను గుర్తించాలన్నారు. దెబ్బతిన్న పొలాలు, ఉద్యాన పంటలు వాస్తవ సమాచారం ద్వారా నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను ప్రభుత్వానికి పంపితే ప్రభుత్వం నష్టపోయిన వారిని తప్పనిసరిగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మైనారిటీ సెల్ విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్ హనీఫ్, మండల ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్, సొసైటీ డైరెక్టర్ గవిని లక్ష్మీ దుర్గ, పల్లా వాసుదేవరాయుడు, కార్యక్రమంలో కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, ఏఎంసీ చైర్ పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, ఏడీఏ లక్ష్మీ, క్రాప పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, సుంకర రాంబాబు, జీవిఎల్‌జి భగవాన్, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు, డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకుంటాం: మంత్రులు

బాపట్లరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రులు కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల మండలంలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి పొలాలను బుధవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి మంత్రులు పరిశీలించారు. అనంతరం బాపట్ల మండలం అడవిపల్లెపాలెం గ్రామంలో మత్స్యకార కుటుంబాలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో తుపాన్ కొంత మేర ప్రజలను నష్ట పరిచినప్పటికీ ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తినష్టం జరగలేదన్నారు. తుఫాన్ తీవ్రత తగ్గిపోయిందని నష్టపోయినపంట వివరాల అంచనాలు తయారు చేయాలని వ్యవసాయశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశామన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతిరైతుకు నష్టపరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుఫాన్ వల్ల దెబ్బతిన్న గృహ యజమానులకు నష్టపరిహారం అందించాలన్నారు. జిల్లాలో తుఫాన్ వల్ల 100 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయటానికి చర్యలు చేపట్టామన్నారు. అద్దంకి గండ్లకమ్మ నదీ ప్రవాహంలో చిక్కుకుపోయిన వారిని రక్షించామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

కుప్పకూలిన బెలూన్ థియేటర్

బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా వీచిన తీవ్రమైన గాలులు, భారీవర్షం కారణంగా బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని చింతాయపాలెం దగ్గర బెలూన్ థియేటర్ కుప్పకూలింది. ఆంధ్రప్రదేశ్‌లో రెండోవదిగా ఇక్కడ శ్రీహర్ష పిక్చర్ టైమ్ పేరిట బెలూన్ థియేటర్‌ను మూడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. గతంలో సంభవించిన తుఫాన్‌కు తట్టుకొని నిలబడిన బెలూన్ థియేటర్ ఈ సారి మొంథా తుఫాన్ గాలులకు నేలవాలింది.



కూలిన బెలూన్ థియేటర్

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్‌లు, కుందేరువాగు

- పరిశీలించిన ఎస్పీ ఉమామహేశ్వర్
- నల్లమడ ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన



నల్లమడ డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షం వల్ల డ్రైనేజీలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బాపట్ల మండలంలోని నల్లమడ డ్రెయిన్, పేరలి డ్రెయిన్, కర్లపాలెం మండలంలోని ఈస్ట్ తుంగభద్ర, పిట్టలవానిపాలెం మండలంలోని తెనాలి డ్రెయిన్‌లలో వర్షపునీటితోపాటు ఎగువ ప్రాంతాలు నుంచి వచ్చి చేరిన వరదనీరు కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నల్లమడ డ్రెయిన్ ప్రవాహాన్ని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం ఉదయం పరిశీలించారు. వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డ్రైనేజి అధికారులకు సూచించారు. సూర్యలంక సముద్రతీరానికి వెళ్ళేరోడ్డులో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ దగ్గర కుందేరు వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు ప్రవాహం తగ్గలేదు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆప్రాంతాన్ని సందర్శించి గజ ఈతగాళ్ళకు, పోలీసుసిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్డీవో పి.గ్లోరియా తహసీల్దార్ షేక్ సలీమా, డిప్యూటీ ఎంపీడీవో జి.రామకృష్ణ, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సూర్యలంక సముద్రం వాయుగుండం తీరం దాటే సమయంలో వాచ్ టవర్ దాటి ముందుకు వచ్చింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. బుధవారం రాత్రి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జిల్లెళ్ళమూడి గ్రామం వద్ద నల్లమడ డ్రెయిన్ ఉధృతిని పరిశీలించారు. వరద ప్రభావం ఏమేరకు ఉంటుందో పరిశీలించాలని అధికారులకు సూచించారు.



కుందేరు వాగును పరిశీలిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

తుఫాన్ ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఏఎంసీ ఛైర్మన్ కావూరి



వర్షపునీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న కావూరి శ్రీనివాసరెడ్డి

బాపట్లరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీలోని గ్రామాలలో తుఫాన్ ముంపుప్రాంతాన్ని బుధవారం బాపట్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఆయా గ్రామాలలోని గృహాలలో చేరిన వర్షపు నీటిని ఎక్స్‌కవేటర్‌తో తొలిగింపు పనులను ఆయన చేపట్టారు. వెస్ట్ బాపట్ల టీడీపీ అధ్యక్షులు సమ్మెట మల్లికార్జునరెడ్డి, తుమ్మా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మొంథా తుపాన్ కారణంగా వివిధ గ్రామపంచాయతీలలో కురిసిన భారీవర్షానికి, వీచిన గాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. యుద్ధప్రాతిపదికన విద్యుత్ శాఖాధికారులు సరఫరాను నిలిపివేసి పలుచోట్ల నేలకొరిగిన స్తంభాలను, విద్యుత్ తీగలను పునరుద్ధరించారు. మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ శేఖర్, ఎస్ఐ వెంకటశివకుమార్ ఆయా శిబిరాలను పరిశీలించి బాధితులకు భోజన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించారు. అదేవిధంగా పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు ఎండి అఫ్జల్, చందోలుగ్రామ టీడీపీయువనాయకులు సయ్యద్ నిజాం, గ్రామపంచాయతీ కార్యదర్శి బి.సుజాత, వీఆర్వో అరుణ ప్రసన్న, సచివాలయ ఉద్యోగులు, గ్రామపంచాయతీ సిబ్బంది, మండల ప్రత్యేకాధికారులతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

● మండలంలోని చందోలు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులకు టీడీపీ నాయకుడు ఖాజా, ఆయన కుమారుడు నిఖిల్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు.

● బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర తుఫాన్ ప్రభావం కారణంగా నిరాశ్రయులైన ప్రజలకు బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రజలకు, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్‌లు, బ్రెడ్‌లు, ఏరియా వైద్యశాలలోని రోగులకు బ్రెడ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

● బాపట్లలోని 11వ వార్డు ఇందిరానగర్ సమీపంలో తుఫాన్ బాధితులకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సాదు నాగేశ్వరరావు నిత్యవసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు.

● కర్లపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలో మొంథా తుఫాన్ కారణంగా పలు పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు కర్లపాలెం మండల యూటీఎఫ్ ఉపాధ్యాయులు అరటిగెలలను తీసుకొచ్చి ప్రజలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో కెఎల్ ప్రభాకరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, యూటీఎఫ్ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు అన్నారు. చెరుకుపల్లిలోని ఎస్టీకాలనీవాసులకు మంత్రి సత్యప్రసాద్ ఆదేశాలతో బుధవారం నిత్యవసర వస్తువులు, సరుకులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దివిరాంబాబు, మొహమాటం రాధాకృష్ణమూర్తి, చెన్నకేశవస్వామి దేవస్థానం ఛైర్మన్ కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి : కోన



11వవార్డులో గృహాలను పరిశీలిస్తున్న కోన రఘుపతి, వైసీపీ నాయకులు

బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో గృహాల చుట్టూ నీరు చేరి ఇబ్బందులు పడుతున్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పార్టీశ్రేణులతో కలిసి 11వ వార్డులో నీటమునిగిన గృహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బాధితులను పట్టించుకునేవారే లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, దివ్యాంగుల విభాగంజిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, ఎస్సీసెల్ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, పేరలి రంజిత్ తదితరులు పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాల వారికి వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు బుధవారం అల్పాహారం పంపిణి చేశారు. వెంగళ్‌విహార్‌లోని 500 మందికి అల్పాహారం అందజేసి ఉదారతను చాటుకున్నారు.

కాల్వలలో గుర్రపు డెక్కను తొలిగించిన రైతులు

బాపట్లరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం బసివిరెడ్డిపాలెం గ్రామసమీపంలోని మురికికాల్వలో గుర్రపుడెక్క అడ్డుపడటంతో వర్షపు నీరు పారుదలకు అడ్డంకిగా మారింది. దీంతో గ్రామంలోని రైతులు గుర్రపుడెక్కను తొలిగించారు. ఈ సమస్యపై అధికారులకు తెలిపినప్పటికి పట్టించుకోకపోవటంతో స్వయంగా తామే తొలిగించామని రైతులు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కొల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌కు దెబ్బతిన్న మెట్ట, మాగాణి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కొల్లూరు, వేమూరు మండలాల్లోని కొల్లూరు, క్రాప, అనంతవరం, చిలుమూరు, ఈపూరు, పెదలంక, చింతలంక గ్రామాల్లో దెబ్బతిన్న వరి, అరటి తమలపాకు, కంద, పసుపు, కూరగాయలు, అపరాల పంటలను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో తోడేటి సురేష్, కౌలు రైతు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. పట్టణంలోని పునరావస కేంద్రాలు, నీటిలో ఉన్న వార్డుల్లో బుధవారం పర్యటించారు. ఇళ్ళచుట్టు నీరు చేరిన గృహాల అందరికి నష్టపరిహారం 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, రూ.5 వేలు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు డానియేలు, ఆగస్టీన్, కె.రమేష్ పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌తో పంటలకు భారీ నష్టం

వేమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం గాలులతో కూడిన వర్షంతో గ్రామాల్లోని పైర్లు పూర్తిగా పడిపోయాయి. మెట్ట ప్రాంతంలో వేసిన అరటి తోటలు విరిగి పడ్డాయి. రేపు, మాపో కోతకు సిద్ధమైన వరి పైర్లతో పాటు పొట్ట దశలో ఉన్న పైర్లు పాలు పోసుకునేదశలో ఉన్న పైర్లు పూర్తిగా పడిపోయాయి. పల్లపు ప్రాంతాల్లో ఉన్న భూముల్లో పడిపోయిన పైర్లపై నీరు నిలిచిపోయింది. చేతిదాక వచ్చిన పంట తుఫాన్ ప్రభావంతో దెబ్బతినడం వల్ల రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వేసిన కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

గాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు



పెరవలిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టిన సిబ్బంది

తుఫాన్ కారణంగా ఏర్పడిన గాలులకు మంగళవారం రాత్రి మండల పరిధిలోని గ్రామాలలో 20 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో మంగళవారం రాత్రి పది గంటల నుంచి 17 గ్రామాలలో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం ఉదయం ట్రాన్స్‌కో ఏఈ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక సిబ్బంది పడిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు దెబ్బతిన్న వైర్లను సరి చేశారు. ఐదు ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం 5గంటలకు గ్రామాలకు తిరిగి విద్యుత్ సరఫరా ఇచ్చారు. ఐదు లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

తుఫాన్‌కు వరి, వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం

కొల్లూరు, భట్టిప్రోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులు, వర్షానికి వరితో పాటు వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. కొల్లూరు, భట్టిప్రోలులో మండలాల్లోని లంక గ్రామాల రైతులు సాగు చేస్తున్న అరటి, బొప్పాయి, తమలపాకు తోటలు మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు భారీగా వీచిన ఈదురు గాలులకు విరిగి పడ్డాయి. పసుపు, కంద, మినుము పంటలు సైతం వర్షం బారిన పడ్డాయి. వరి పంట కూడా దాదాపుగా గాలులు, వర్షం తీవ్రతకు నేలవాలి వర్షపు నీటిలో నానుతున్నాయి. ప్రభుత్వ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టం అంచనాలు వేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేలకొరిగిన పంట పొలాలు

అమృతలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపానుతో వీచిన గాలులకు పంట పొలాలు నేలకొరిగాయి. కాగా పలు చోట్ల చెట్లు రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన తొలగించింది. తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు నేతృత్వంలో మండల స్థాయి అధికారులు మంగళవారం రాత్రి పలు గ్రామాల్లో పర్యటించిన అధికారులకు పలు సూచనలు చేశారు. మండల పరిధి లోని గ్రామాల్లో సుమారు 7 వేల ఎకరాల పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాశాఖ అధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో పంట నష్టంను పరిశీలించారు. విస్తరణాధికారులు మణికంఠ, మాధవి, తిరుపతమ్మ, విఏఏలు మౌనిక, వాణి, బాలభాస్కర్, దేవిలాల్‌నాయక్, బి.నరేంద్ర పాల్గొన్నారు.



బాపట్ల మండలం పాండురంగాపురం గ్రామంలో నీటమునిగిన మిరప పంట

వందల ఎకరాలలో మిరప పంట నీటి పాలు

బాపట్లరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ మిరప పంట రైతులను నిండా ముంచేసింది. బాపట్ల మండలం పాండురంగాపురం గ్రామంలో సుమారు 200 ఎకరాలకు పైగా మిరప పంటను రైతులు సాగు చేస్తున్నారు. మిరప పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రావటంతో అధిక వర్షం వలన పంట మొత్తం నీట మునిగింది. చేసేదేమిలేక రైతులు పంట ఆరంభంలోనే బెట్టకొచ్చిన అరకొర మిరపకాయలను కూలీల ద్వారా కోపించి రోడ్ల మీద అరబోశారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని విన్నవించుకున్నారు. బాపట్ల మండలంలోని వరి పంట పొలాలు నీట మునిగాయి.

3950 ఎకరాలలో నీట మునిగిన వరి

చుండూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 18,937 ఎకరాలలో వరి సాగు ఉండగా తుఫాన్ కారణంగా 3950 ఎకరాలలో వరి పూర్తిగా నీట మునిగింది. 75 ఎకరాలలో మినుము పంటకు నష్టం వాటిల్లింది. అరటి తోటలు నేలవాలాయి. ఏవో ఆదాంబాబు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. యడ్లపల్లి, కార్యారువారిపాలెం, మండూరు, పెదగాదెలవర్రులో చెట్లు ఒరిగిపోవడం, రోడ్లపై చేరిన వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన చోట సిబ్బంది సకాలంలో స్పందించారు. ప్రత్యేక అధికారి షేక్ ఖలీల్, ఎండీవో సుదీప, తహసీల్దార్ నాగరాజు, మండల అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, ముందుకు వచ్చి అధికారులకు తోడ్పాటు అందించారు.



అమృతలూరులో నేలకొరిగిన పంట పొలాలు



మండూరులో రైతులకు సూచనలిస్తున్న ఏవో ఆదాంబాబు

లోతట్టు ప్రాంతాలు జలమయం

- రహదార్లపై కాల్వలా ప్రవహిస్తున్న వర్షపునీరు
- కాలనీవాసులకు దుర్భర పరిస్థితి



ఫ్యాడిసన్ పేట జగనన్నకాలనీ గృహాల చుట్టూ చేరిన వర్షపునీరు

బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నిలువునా ముంచింది. ప్రధాన రహదార్లపై వర్షపునీరు ఏరులై పారుతుంది. లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. మురికివాడల ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పెద్దఎత్తున సహాయక చర్యలు చేపట్టినప్పటికి తుఫాన్ ప్రభావం పెద్ద ఎత్తున నష్టం చేకూర్చింది. బాపట్లలో అర్ధరాత్రి తర్వాత శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం పక్కనే చెట్టు నేలకూలింది. దీంతో దేవాలయం ప్రహరీ విరిగిపడింది. పాతబస్టాండ్ దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్ళేరోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం దగ్గర చెట్టు కూలింది. కలెక్టర్ బంగ్లా వద్ద పెద్దచెట్టు నేలవాలి విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది. కర్లపాలెం రోడ్డులో ఎస్బీఐ బ్యాంక్ కార్యాలయం ఎదుట, బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ఎదురు రోడ్డుపై నిలిచిన నీరు నిలిచింది. అదేవిధంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కాలేజి ఎదురు పాకల చుట్టూ వర్షపునీరు చేరింది. ఆంధ్రకేసరి నగర్, 1వవార్డు గంగపుత్రకాలనీ నీటమునిగింది. ఫ్యాడిసన్‌పేటలో ఇళ్ళచుట్టూ నీరు చేరింది. ఫ్యాడిసన్ పేట జగనన్నకాలనీ జలదిగ్బంధలో చిక్కుకుంది. సూర్యలంకరోడ్డులో ఇండేన్‌గ్యాస్ గోదాం ఎదురు నీరు పెద్దఎత్తున ప్రవహిస్తున్నది. 3వ వార్డు రాజీవ్ గాంధీకాలనీలో రోడ్లపై వర్షపునీరు కాల్వలా ప్రవహిస్తున్నది. భావపురికాలనీ, చెంగల్రాయుడుతోటలో ఇళ్ళచుట్టూ నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద హోర్డింగ్‌లు సైతం నేలవాలాయి. ఈవిధంగా మొంథా తుఫాన్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలగజేసింది.

గర్భగుడిలోకి వర్షపునీరు



గర్భగుడిలోకి చేరిన వర్షపునీరు

బాపట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం గర్భగుడిలోకి తుఫాన్ ప్రభావంతో భారీ వర్షంతో నీరు చేరింది. నీటిని ఆలయంలోకి వెళ్ళకుండా చర్యలు చేపట్టాల్సిన పురావస్తుశాఖాధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరించటం వల్లే నీరు వచ్చిందని బీజేపీ నాయకులు, స్వామివారి భక్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా తుఫాన్ కారణంగా వీచిన గాలులతో దేవాలయం పక్కనే ఉన్న చెట్టు పడిపోయి పూర్వ కట్టిన ప్రహరీ కూలింది. ఈవిధంగా జరగటంపై భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ నాయకుడు వి.భావన్నారాయణ అన్నారు.

కర్లపాలెంలో కుండపోత వర్షం



కర్లపాలెంలో నీటితో నిండిన రొయ్యల చెరువులు

కర్లపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తుఫాన్ కారణంగా బలమైన గాలులతోపాటు భారీ వర్షం కురిసింది. మండలంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎంవీ రాజుపాలెం, యాజలి, తిమ్మారెడ్డిపాలెం పొలాలు భారీ వర్షంతో నీటమునిగాయి. రొయ్యల చెరువులలో కట్టల అంచుల వరకు వర్షపునీరు చేరటంతో నిండుకుండలా మారాయి. మండలంలోని పలు గ్రామాలలో చెట్లు విరిగి రహదార్లపై పడటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమై తొలిగించారు. బుద్దాంలోని తుంగభద్ర కాల్వ కట్టలు అంచుల వరకు ప్రవహిస్తుంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మండల అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లను చేశారు.

విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



కొల్లూరులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

కొల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో భారీగా వీచిన గాలుల వల్ల చెట్లు విద్యుత్ స్తంభాలపై విరిగి పడ్డాయి. కొల్లూరు మండలంలో మంగళవారం సాయంత్రం గాలులకు తోడు భారీ వర్షం తోడు కావడంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు వీలు కాకపోవడంతో గ్రామాల్లో గాఢాంధకారం నెలకొంది. బుధవారం ఉదయం నుంచి వర్షం లేకపోవడంతో సిబ్బంది విద్యుత్ పునరుద్ధరించి మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా చేశారు. భారీ వర్షానికి కొల్లూరులోని ప్రధాన రహదారితో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీ వృక్షాలు నేలకూలాయి. ఎస్ఐ అమరవర్ధన్ యంత్రాల సహాయంతో నేలకు ఒరిగిన వృక్షాలను రోడ్లపై నుంచి తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా నీట మునిగిన పొలాల రైతులు ఆందోళన చెందవద్దని శాస్త్రవేత్తలైన డాక్టర్ బి.కృష్ణవేణి, ఎన్.కామాక్షి తెలిపారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో నీటమునిగిన నేలవాలిన పంటపొలాల రైతులు కాపాడుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఈవో మహేష్‌బాబు, వీఈవోప్రసాద్‌రైతులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఐసీడీఎస్ పీడీ

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని అమృతలూరు ఐసీడీఎస్ సీడీపీవో ఎ.లక్ష్మీదేవితో కలిసి పీడీ రాధామాధవి బుధవారం పరిశీలించారు. తుఫాన్ బాధితులను పరామర్శించి అందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి అందుబాటులో ఉంచిన మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ వి.సంపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పైరును పరిశీలించిన అధికారులు

చెరుకుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ రైతుల గుండెలపై మోయలేనిభారాన్ని మోపింది. గూడవల్లి, నడింపల్లి గ్రామాల్లో నేలవాలిన వరి పైరును వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మి, ఏవో ఫరూక్ పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలపాటి నరేంద్రబాబు, ఏఈవో రామకృష్ణ, రైతులు జీ.వెంకటసుబ్బారావు, జీ.రామాంజనేయులు, ఎం.శ్రీనివాస్, జీ.సురేష్, రాము పాల్గొన్నారు.

తీరంలో ప్రజలకు అండగా నిలుస్తాం : అనగాని



కూచినపూడిలో తుఫాన్ నష్టంపై అధికారులతో మాట్లాడుతున్న అనగాని శివప్రసాద్

నిజాంపట్నం(రేపల్లె), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయినవారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. వరద ఉధృతి తగ్గటంతో రేపల్లె పట్టణం, నిజాంపట్నం మండలం కూచినపూడి, పల్లపట్ల, తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షులు కొలసానిరాము, టీడీపీనాయకులు నల్లపాటి యల్లయ్య, కొలసానిప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో భారీగా నేలవాలిన చెట్లు



రావిఅనంతవరం సమీపంలో ఈదురుగాలులకు దెబ్బతిన్న కందపంట

రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని రేపల్లె పట్టణంలో ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద బసవేశ్వర థియేటర్ ప్రక్కన 25వవార్డులో 1వవార్డులో భారీచెట్లు నేలవాలాయి. కూచినపూడి, అడవులదీవి, పల్లపట్ల, ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయాయి. వెంటనే చెట్లను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. నిజాంపట్నం, చెరుకుపల్లి, నగరంలోని పలుగ్రామాల్లో చెట్లు విరిగిరోడ్డుపై పడటంతో ఆయా గ్రామస్థులు, పంచాయతీ అధికారులు చెట్లను తొలగించారు. రేపల్లె ఆర్టీసీ డిపో లో మోకాలులోతు నీటిలో ఉంది. 15 మీటర్లమేరా ప్రహరీ కూలింది. ప్రభుత్వ జూనియర్, పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో మోకాలులోతు నీళ్ళు నిలిచాయి.

● చెరుకుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథాతుఫాన్ మండలంలో బీభత్సాన్ని సృష్టించింది. అనేకచోట్ల రహదారులపై చెట్లు కూలి కరంటు తీగలపై పడటంతో తీగలు తెగిపోయాయి. గొర్రెలు, గేదెల పాకలు కూలిపోయాయి. నడింపల్లిలో మార్కెట్‌యార్డు వైస్‌ఛైర్మన్ గోగినేని వసుధకు చెందిన 105 సంవత్సరాల నాటి పెంకుటిల్లు వెనుక భాగం కుప్పకూలిపోయింది. చెరుకుపల్లి వీరరాఘవయ్యపేటలో కారుపై కొబ్బరిచెట్టుపడటంతో కారుపైభాగం దెబ్బతింది. పునరావాస కేంద్రాలను తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో మహబూబ్ సుబాని, ఎస్ఐ టి.అనిల్‌కుమార్ సందర్శించి వారికి సహాయ సహకారాలను అందించారు.

● కర్లపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలో మొంథా తుపాన్ కారణంగా వీచిన బలమైన గాలులకు సమ్మెటవారిపాలెం, పేరలి రమదారిలో మూడు భారీ వృక్షాలు నేలకొరిగాయి. సమ్మెటవారిపాలెంలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై రవీంద్ర, సీఐ హరికృష్ణలు, తహసీల్దార్ షాకీర్ పాషా ఆధ్వర్యంలో రహదారిపై పడిన చెట్లను కోతమిషన్‌తో కట్ చేయించి పక్కన వేశారు.

● కర్లపాలెం పంచాయతీ పరిధిలోని తెలగాపాలెంలో తుఫాన్ కారణంగా మంగళవారం వీచిన గాలులకు కొబ్బరిచెట్టు విరిగి పడి రేకుల ఇల్లు ధ్వంసమైంది. అదృష్టవశాత్తు కుటుంబ సభ్యులు పంచలో ఉండటంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోట అఖిల్ కోరుతున్నారు.

● బాపట్లరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈస్ట్‌బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలోని నందిరాజుతోట, హైదర్‌పేటలో మొంథా తుపాన్ వలన నేలవాలిన చెట్లను బుధవారం తొలిగింపు పనులను బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రోడ్లపై పడిన చెట్లను ఆయా పంచాయతీ అధికారులు తొలిగించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాణి, డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా ఏర్పడిన గాలులకు మంగళవారం రాత్రి మండల పరిధిలోని గ్రామాలలో పలు చోట్ల పెద్ద వృక్షాలు పడిపోయాయి. రహదారులకు అడ్డంగా పడిపోవడంతో వేమూరు ఎస్ఐ శ్రీనివాసరావు అర్ధరాత్రి సమయంలో తమ సిబ్బందితో పాటు ప్రత్యేకంగా కొందరు కార్మికులను పిలిపించి జంపని, కొల్లూరు ప్రధాన రహదారిపై పలుచోట్ల పడిన చెట్లను వేమూరు, చావలి రోడ్డుపై పడిపోయిన చెట్లను అలాగే వేమూరు ఆయిల్ బంక్ వద్ద పడిన చెట్లను కట్టర్లు జేసీబీల సహాయంతో తొలగింపజేశారు. ఎస్ఐ శ్రీనివాసరావుకు ప్రజలు ప్రశంసల జల్లు కురిపించారు.

తుఫాన్ తాకిడికి కూలిన ధ్వజస్తంభం

రేపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి భారీగా వీచిన ఈదురుగాలులు, వర్షానికి మండలంలోని రావిఅనంతవరం వేణుగోపాలస్వామి దేవాలయం ధ్వజస్తంభం నేలకూలింది. సుమారు 100 ఏళ్ళు చరిత్ర ఉన్న ఈ దేవాలయం ధ్వజస్తంభం కూలటంతో అధికారులు, నాయకులు దృష్టిసారించి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పేరలిపాడులో షెడ్ కూలి పశువులు మృతి

కర్లపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలిపాడులో మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి వీచిన బలమైన గాలులకు అమర్తలూరు జ్ఞానమ్మకు చెందిన పశువుల షెడ్ కూలిపోయింది. షెడ్‌లో ఉన రెండు పశువులపై షెడ్ పడటంతో రెండు గేదెలు మృతి చెందాయి. ప్రభుత్వం తమకు సాయం అందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పంట నష్టపోకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నేలవాలిన వరి పంట నష్టపోకుండా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.కృష్ణవేణి, డాక్టర్ ఎస్.కామాక్షి సూచించారు. మండల పరిధిలోని ఐలవరం గ్రామంలో బుధవారం వర్షాలకు పడిపోయిన వరి పైర్లను జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో సందర్శించారు. కార్యక్రమంలో ఏవో బ్రహ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


బాపట్ల రోడ్డుపై చెట్లను తొలగించిన సీఐ హరికృష్ణ, తహసీల్దారు


చిన్నచెరువు ఉప్పాంగి ప్రత్తిపాడులో నీట మునిగిన ప్రధాన రోడ్డు


నాదెండ్ల: ఎండుగంపాలెం పునరావాస కేంద్రంలో బాధితులు


బాపట్ల: మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న పల్నాడు కలెక్టర్

మొత్తమొంథా అలజడి



పెద్దమద్దూరు వాగు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


గుంటూరులో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

మొంథా తుపాను తీరం దాటే సమయంలో ఉమ్మడి జిల్లా మొత్తం అలజడి సృష్టించింది. భారీ ఈదురు గాలులకు రోడ్లపై చెట్లు నేలకూలాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వరి, పత్తి, కంద ఇతర పంటలు పూర్తి ముంపునకు గురయ్యాయి. పట్టణ, పల్లె ప్రాంతాల రోడ్లు జలమయమై.. చెరువులను తలపించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అధికారుల హెచ్చరికలు లెక్కచేయకుండా.. కొంతమంది ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల చప్టాలను దాటే క్రమంలో, అలాగే కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకోగా పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. విద్యుత్ స్తంభాలు నేలవాలగా.. కొన్ని కోట్ల తీగలు తెగి రోడ్ల పడ్డాయి. విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపడిన విద్యుత్ తీగలను, నేల కూలిన చెట్లను తొలగిస్తూ.. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పనిచేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పునరావాస కేంద్రాలను సందర్శించి, ఆశ్రయం పొందుతున్న ముంపు ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. వారికి కల్పించిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణాల్లో ఎక్కడికక్కడ నీరు నిలబడకుండా పారిశుధ్య సిబ్బంది పనిచేశారు.

- గుంటూరు-ఆంధ్రజ్యోతి


బాపట్లలో ఈదురు గాలులకు వణికిపోతున్న కొబ్బరి చెట్లు


ఐనవోలు వద్ద వల్లేరు వాగు ఉధృతికి నిలిచిపోయిన రాకపోకలు


కొల్లూరులో గాలులు వాలిపోయిన బొప్పాయి తోట


చిలకలూరిపేటలో పర్యటిస్తున్న కలెక్టర్ కృతికా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి


గుంటూరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన లారీలు


గుంటూరు: ఏటి అగ్రహారంలో వర్షపు నీటిలో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారుడు


తిమ్మాపురం అండర్ పాస్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


గుంటూరు మురికి పేటలో పొంగిపొర్లుతున్న డ్రెయిన్

సస్యరక్షణతోనే వరి పంట చేతికి..!



- వరి పంటపై తుపాను ప్రభావం
- రైతులకు జాగ్రత్తలు పాటించాలి
- రంగా వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో వరి పంట సంరక్షణకు రైతులు తీసుకోవాల్సిన చర్యలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ బుధవారం వివరించారు. తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల రైతులు అప్రమత్తం కావాలని హెచ్చరించారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ సూచనలు చేశారు. ప్రస్తుతం వరి పంట పూత దశ, పాలు పోసుకునే, కోత దశలలో ఉంది. వీలైనంత వరకు పొలం నుంచి వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపాలి. పూత దశకు ముందు ఉన్న చేలల్లో.. వర్షం తగ్గిన తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే ఎండాకు, మానిపండు తెగులు, మాగుడు, ఆకుముడత తెగుళ్లు, దోమపోటు పెరిగే అవకాశం ఉంది.

గింజ గట్టిపడే దశలో ఉంటే

నిరంతర వర్షాల వల్ల ధాన్యపు గింజలో నిద్రావస్థ తొలగి నిలబడి, పడిపోయిన చేలలో మొలక వచ్చే అవకాశం ఉంది. కోత దశలో నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే.. నీరు బయటకు తీసివేసిన తర్వాత. 5 శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాములు కల్లు ఉప్పు/లీటరు నీటికి)కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకెత్తడాన్ని, రంగు మారడాన్ని తగ్గిస్తుంది.

కల్లాల మీద ధాన్యం ఉన్నప్పుడు

ఇప్పటికే కోతకోసి కుప్పల మీద ఉన్న ధాన్యాన్ని బరకాలు కప్పుకొని రక్షించుకోవాలి. నూర్పిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండబెట్టడానికి వీలుకాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా క్వింటా ధాన్యానికి కేజీ ఉప్పు, 20 కేజీల పొడి ఊక కలపాలి.

పూత దశలో తెగుళ్ల నివారణ

రైతులు పంట దశ, పురుగు, తెగుళ్ల ఉధృతిని బట్టి సస్య రక్షణ చేపట్టాలి. బ్యాక్టీరియా ఎండాకు తెగులు కనిపిస్తే ప్లాంటోమైసిన్ ఒక మి.లీ/లీటరు + కొసైడ్ (కాపర్ హైడ్రాక్సయిడ్) 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● నీరు తగ్గిన తర్వాత హెక్సాకోనాజోల్ 400మి.లీ.. ఎకరాకు లేదా ప్రోపికోనాజోల్ 200 మి.లీ పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుంది.

● మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ. ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.

● ఆకుముడత పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు లేదా క్లోరాన్ట్రిప్రోల్ 60 మి.లీ 200 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

● దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు నివారణకు ఎకరాకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ● పైమెట్రోజాన్ 120గ్రాములు లేదా ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు+96 మిల్లీలీటర్ల ట్రైఫ్లుమెజోపైరం 10 ఎస్‌సీ పిచికారీ చేసుకోవాలి.

తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీకి అందుబాటులో ఉన్న డ్రోన్‌లను ఉపయోగించుకోవాలి.

● పూత దశలో ఉన్న పంట (ఎంటీయూ-1061, ఎంటీయూ- 1318, ఎంటీయూ-1262, బీపీటీ-5204): నీరు నిలబడి ఉన్న చేలలో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉంది. ధాన్యం రంగు మారకుండా, మానిపండు, మాగుడు తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

● పాలు పోసుకునే దశలో ఉన్న పంటలు (స్వర్ణ, సంపద స్వర్ణ, బీపీటీ- 5204, ఆర్‌ఎన్‌ఆర్-15048, కేఎన్‌ఎం-1638 మొదలైనవి) వర్షాలకు పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. అవకాశాన్ని బట్టి పడిపోయిన పంటను పైకి లేపి కట్టుకోవాలి. నిలబడి ఉన్న, పడిపోయిన పంట చేలలో గింజలు రంగు మారడం, మాగుడు, మానిపండు తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి.

గుంటూరుకు పలు రైళ్ల పాక్షిక రద్దు

- డోర్నకల్‌లో రైలు పట్టాల పైకి వరద నీరు
- కొన్ని రైళ్లు గుంటూరు - పగిడిపల్లి మార్గంలో మళ్లింపు



గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షం కారణంగా వరంగల్ సమీపంలోని డోర్నకల్ రైల్వేస్టేషన్ యార్డులోకి భారీగా వరద నీరు చేరి నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో గుంటూరుకు రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేశారు. బుధవారం ఉదయం 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను డోర్నకల్ సమీపానికి వెళ్లేసరికి రైలు పట్టాలపై వరద నీరు చేరడంతో అక్కడే నిలిపేశారు. వరద తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ సర్వీసును రద్దు చేశారు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని కూడా వరంగల్ వరకే నడిపి వరంగల్ - గుంటూరు మధ్యన రద్దు చేశారు. దీని వల్ల మధ్యాహ్నం గుంటూరు నుంచి బయలుదేరాల్సిన 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీని పూర్తిగా రద్దు చేయాల్సి వచ్చింది. 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని పగిడిపల్లి - నడికుడి మీదగా గుంటూరుకు దారి మళ్లించారు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ని విజయవాడ నుంచి కృష్ణాకెనాల్, గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించి సికింద్రాబాద్‌కు తీసుకెళ్లారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, 17205 షిర్డి సాయినగర్ - కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్, 11019 ముంబై సీఎస్‌టీ - భువనేశ్వర్, 18046 చర్లపల్లి - షాలిమార్, 17206 కాకినాడ పోర్టు - షిర్డి సాయినగర్, 17405 తిరుపతి - అదిలాబాద్, ఎక్స్‌ప్రెస్‌లను కూడా గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లించారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్ రద్దు

12747 గుంటూరు - వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ రోజులానే వికారబాద్‌కు వెళ్లింది. ఇదే రేక్ నంబరు 12748గా మారి వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌గా రిటర్న్ రావాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో రద్దు చేశారు. దీంతో గురువారం ఉదయం గుంటూరు నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ తెలిపారు. వికారబాద్ నుంచి పల్నాడు ఎక్స్‌ప్రెస్ సర్వీసుని గురువారం పునరుద్ధరిస్తామన్నారు.

డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు

- మొంథా తుపానుతో పలు సర్వీసులు రద్దు


గుంటూరులో డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు


గుంటూరు-2 డిపో గ్యారేజ్‌లోకి చేరిన వర్షపునీరు

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో అత్యధిక బస్సు సర్వీసులు ఆర్టీసీ డిపోలకే పరిమితమయ్యాయి. మూడు రోజులుగా గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ ప్రయాణికుల్లేక బోసిపోతోంది. మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల్లోనూ సర్వీసులను తగ్గించుకోవాల్సి వచ్చింది. తుపాను ప్రభావం చూపిన బుధవారం ఆర్టీసీ యంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు ప్రజా రవాణాధికారి డి. సామ్రాజ్యం ఎప్పటికప్పుడు పలు రూట్‌ల పరిస్థితిని సమీక్షించారు. సర్వీసులను రద్దు చేశారు. అమరావతి రూట్, తెనాలి, బాపట్ల, పర్చూరు, మాచర్ల వంటి రూట్‌లలో రహదారుల పరిస్థితి, చప్టాల వద్ద వరదలు కారణంగా.. ఆయా రూట్‌లలో బస్సులను నిలిపివేశారు. ఆర్టీసీ ఆదాయంపై మొంథా తుపాను ప్రభావం పూర్తి స్థాయిలో కనిపి స్తోంది. మూడు రోజు లుగా ప్రయా ణికుల రాకపోకల్లేక బస్సులు అరకొర ప్రయాణికులతో నడుస్తున్నాయి. మరో రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సాగర్ ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండ చరియలు

విజయపురిసౌత్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): భారీ వర్షాలకు నాగార్జున సాగర్ స రిహద్దు.. అంతరాష్ట్ర చెక్‌పోస్టుకు వెళ్లే ఘా టు రోడ్డులో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో ఎటువంటి వాహ నాలు ఆ వైపు వెళ్లకపోవడంతో పెను ప్రమా దం తప్పింది. విషయం తెలుసుకున్న విజ యపురిసౌత్ ఎస్ఐ ఘటనా ప్రాంతానికి చే రుకొని క్రేను సాయంతో కొండ చరియలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ర వికుమార్, వీఆర్ఏ రవి తదితరులు పాల్గొ న్నారు.


రహదారిపై విరిగిపడ్డ కొండ చరియలు

గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో..

విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు

- రూ. 188.31 కోట్ల నిధులకు ఆమోదం తెలిపిన కేంద్రం
- విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్‌లోనూ ఏర్పాటు


రైల్వే విద్యుత్ ట్రాక్షన్

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పగిడిపల్లి సెక్షన్‌లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాక్షన్ సామర్థ్యాన్ని రైల్వే శాఖ రెట్టింపు చేసేందుకు నిర్ణయించింది. 1 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్‌ని సామర్థ్యాన్ని 2 25 కేవీకి పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. మూడేళ్లలో ఈ ప్రాజెక్టుని రూ.188.31 కోట్లతో పూర్తి చేస్తారు. ఇందులో భాగంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు, అదనపు కండ క్టర్లను ఏర్పాటు చేయడం వంటి పనులు చేస్తారు. దీని వల్ల విద్యుత్ ప్రసార నష్టాలు గణనీయంగా తగ్గిపోతాయి. అలానే రైళ్లను 160 కిలోమీటర్ల వేగంతో నడిపేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. విపత్తులు, ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల సమయంలో వరంగల్ మార్గంలో ప్రయాణిం చే రైళ్లను పగిడిపల్లి మీదగా మళ్లిస్తోన్న దృష్ట్యా విద్యుత్ ట్రాక్షన్ రెట్టింపు ఎంతో అవసరమని రైల్వే శాఖ భావిస్తోంది. హైదరాబాద్, అమరావతిని కలిపే రైలు మార్గాల్లో గుంటూరు - పగిడిపల్లి సెక్షన్ ఒకటి. విష్ణుపురం - మోటుమర్రి మధ్యన గూడ్స్ ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా రైలుమార్గం ఉంది. మొత్తం 337 కిలోమీటర్ల పొడవునా విద్యుత్ ట్రాక్షన్‌ని రెట్టింపు చేయాలని రైల్వే శాఖ ప్రతిపాదించింది. ట్రాక్షన్ రెట్టింపు వల్ల అధిక వోల్టేజీతో విద్యుత్ సరఫరా అందిస్తుంది. తద్వారా రైళ్లు, గూడ్స్‌లను అధిక వేగంతో, ఎక్కువ సామర్థ్యంతో నడపడానికి ఆస్కారం ఏర్పడుతుంది. రైళ్లకు అవసరమైన స్థిరమైన వోల్టేజీని సులభతరం చేస్తుంది. సర్క్యూట్ లోపాలను అధిగమించి నిరంతర విద్యుత్ సరఫరాని అందిస్తుంది. దీని వల్ల సబ్‌స్టేషన్ల సంఖ్యని కూడా తగ్గించుకోవచ్చు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్టుకి బుధవారం పచ్చజెండా ఊపుతూ సికింద్రాబాద్ - విజయవాడ చాలా రద్దీగా ఉండే రైలు మార్గాల్లో ఒకటిగా ఉందన్నారు. పగిడిపల్లి - గుంటూరు, విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ సికింద్రాబాద్, విజయవాడ మధ్య ప్రత్యామ్నాయంగా పని చేస్తుందన్నారు. ఈ మార్గంలో మరిన్ని రైళ్లు నడపడానికి 2 25 కేవీ విద్యుత్ ట్రాక్షన్ ఎంతో అవసరమని గుర్తించి ప్రాజెక్టుని మంజూరు చేశామన్నారు.

చిక్కుకున్న అద్దంకి మునిసిపల్ సిబ్బంది
కాపాడేందుకు వెళ్లిన మరో ముగ్గురు
మత్స్యకారుల పడవ బోల్తా
చెట్టుపైకి ఎక్కిప్రాణాలు
కాపాడుకున్న వైనం
అందర్నీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చేవరకు
కష్టించిన అధికారుల బృందం
యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన మంత్రి
రవికుమార్

గుండ్లకమ్మ నదిలో ఉత్కంఠ.. ఆపై ఊరట..

అద్దంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో గుండ్లకమ్మనదిలో చిక్కుకున్న ఆరుగురు క్షేమంగా ఒడ్డుకు చేరటంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. అద్దంకి పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా చేసే గుండ్లకమ్మ నదిలో ఉన్న ఊటబావుల వద్ద విధులు నిర్వహించే ముగ్గురు మున్సిపల్ సిబ్బంది రుద్రు నరేంద్ర, బాబురావు, శివలు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో నదిలోని వరద నీటిలో చిక్కుకున్నారు. నీటి ప్రవాహం ఒక్కసారి పెరిగి పంప్ హౌస్ గది చుట్టూ చేరాయి. అక్కడ నుండి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఏఈ లోకేష్‌లు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తొలుత చిన్న పడవను మున్సిపల్ కార్మికులను కాపాడేందుకు పంపించారు. ఆ పడవలో వచ్చేందుకు వారు సాహసం చేయలేదు. మరో పెద్ద పడవలో ముగ్గురు జాలర్లను పంపారు. మున్సిపల్ కార్మికులు ముగ్గురిని ఆ పడవలో ఎక్కించుకొని తిరిగి వస్తుండగా ఒక్కసారిగా పడవ నీటి ఉధృతికి బోల్తా పడింది. దీంతో ముగ్గురు మున్సిపల్ కార్మికులు పక్కనే ఉన్న చెట్టును పట్టుకొని పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. కాపాడేందుకు వెళ్లిన ముగ్గురు మత్స్యకారులు కూడా పడవను అక్కడే చెట్టుకు కట్టి దానిపై కూర్చుకున్నారు. సీఐ సుబ్బరాజు ఎప్పటికప్పుడు డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తూ పడవ బోల్తా వద్ద విషయం పసిగట్టారు. వారిని అక్కడే సురక్షితంగా ఉండాలని చెప్పి మరో మత్స్యకారుడు కుమార్‌ను చిన్న పడవలో పంపారు. దాని ద్వారా ఒక్కొక్కరిని క్షేమంగా బయటకు చేర్చారు. ఈ విషయం తెలిసిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్థానిక అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమాచారం తెలుసుకున్నారు. స్పెషల్ ఆఫీసర్, ప్రకాశం డిప్యూటి సీఈవో బాలమ్మ, తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సీఐ సుబ్బరాజు, అగ్నిమాపక అధికారి వెంకటరావులు సుమారు 5 గంటల పాటు అక్కడే ఉండి పర్యవేక్షించారు. అందరు సురక్షింతంగా బయటకు చేరటంతో ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే చీరాల డీఎస్పీ మొయిన్ అద్దంకి చేరుకున్నారు. అప్పటికే ఊటబావుల వద్దకు వెళ్లే రోడ్డు గుండ్లకమ్మ వరద నీటితో నిండిపోవటంతో ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. అందరూ సురక్షితంగా బయటకు వచ్చారని తెలిసిన వెంటనే అధికారులను, కష్టపడి ఒడ్డుకు చేర్చిన మత్స్యకారుడు కుమార్‌ను కలెక్టర్ అభినందించి రివార్డు ప్రకటించారు. అధికారులతో పాటు టీడీపీ నేతలు కాకాని అశోక్, రామాంజనేయులు, గొట్టిముక్కల హరిష్, లహరి, కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజులు అక్కడే ఉండి తమ వంతు సహకారం అందించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వినయ్ పరిశీలించారు. వైసీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్‌కుమార్ మున్సిపల్ సిబ్బందితో మాట్లాడారు.



మున్సిపల్ సిబ్బంది, మత్స్యకారులను సురక్షితంగా బయటకు చేర్చిన కుమార్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

● **లైలా తుఫాన్ అనుభవం ఆందోళన కలిగించింది**

మొయిన్, చీరాల డీఎస్పీ

లైలా తుఫాన్ సమయంలో అద్దంకిలో ఎస్సైగా విధులు నిర్వహించే సమయంలో నా కళ్లఎదుటే నల్లవాగులో కానిస్టేబుల్ రఫీ కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన గుర్తుకు వచ్చింది. ప్రస్తుతం ఆరుగురు చిక్కుకున్నారని తెలిసి ఆందోళన కలగించింది. అందరూ కష్టపడి పనిచేయటంతో వారు సురక్షితంగా బయటకు రావడం ఆనందంగా ఉంది.



అల్లకల్లోలం!

మొంథా తుఫాన్‌తో పొంగిన వాగులు, వంకలు.. నిండిన చెరువులు
పలు గ్రామాలలో పంటలకు తీవ్ర నష్టం
చాలా ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం
అష్టదిగ్బంధంలో పర్చూరు
నీట మునిగిన కాలనీలు
అద్దంకిలో వరదలో చిక్కుకున్న వారిని రక్షించిన అధికారులు
చీరాలలో కూలిన వంతెన
కొణిదెనలో పడిపోయిన చెన్నకేశవస్వామి దేవాలయ గోపురం
పునరావాస కేంద్రాలలో ఉన్న వారికి వసతులు కల్పించిన అధికారులు

బల్లికురవ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను తీరం దాటే సమయంలో ప్రజలను అల్లకల్లోలం చేసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు వర్షం దంచి కొట్టింది. చెరువులు నిండటంతో అలుగుల ద్వారా నీరు ప్రవహించటంతో పలు రోడ్లలో రాకపోకలు నిలిచిపోయాయి. అంబడిపూడి వద్ద గుంటుపల్లి వద్ద చెరువు అలుగు పారింది. నక్కబొక్కలపాడు వద్ద చప్టాపై నీరు రావటంతో రాకపోకలను నిలిపి వేశారు. చెన్నుపల్లి-కొండాయపాలెం మధ్య ఉన్న చప్టాపై వర్షపు నీరు రావటంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. కొప్పెరపాడు ఎస్సీ కాలనీలోకి నీరు చేరింది. అధికారులు పంట నష్టం అంచనాలను తయారు చేసే పనిలో ఉన్నారు. కొణిదెనలో చెన్నకేశవస్వామిఆలయ గోపురం కూలిపోయింది. గ్రానైట్ క్వారీల్లో పనులు నిలిచిపోయాయి.

అధికారులు గ్రామాలలో పహరా

తహసీల్దార్, రవినాయక్, ఎంపీడీవో కుసుమ కుమారి, సీఐ వెంకట్రావు, ఎస్ఐ నాగరాజు పలు శాఖల అధికారులు తుఫాన్ ప్రభావంతో ప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గంట గంటకు గ్రామాలలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు.

● **ఆగమేఘాల మీద స్పందించి విద్యుత్‌శాఖ**

బల్లికురవకు వచ్చే విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలు పడిపోయాయి. బుధవారం వేకువ నుంచి సరఫరా నిలిచిపోయింది. మాగాణి భూమిలో రెండు స్తంభాలు పడిపోవటంతో యంత్రాలు వెళ్లే వీలు లేక 30 మంది కూలీలను రంగంలోకి దించి వాటిని పైకి లేపి సరఫరాను పునరుద్ధరించారు. గంటల వ్యవధిలోనే విద్యుత్‌ను ప్రజలకు ఇబ్బంది లేకుండా అందించారు.

అద్దంకిలో 18.5 సెంటీమీటర్ల వర్షపాతం

అద్దంకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో బుధవారం ఉదయానికి 18.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుండ్లకమ్మ నదితో పాటు పలు వాగులు పొంగి ప్రవహించాయి. భవనాసి అలుగు వరకు గుండ్లకమ్మ నది నీరు చేరింది. అద్దంకి సమీపంలో నల్లవాగు ఉధృతంగా ప్రవహించటంతో రేణింగవరం, నాగులపాడు, చెరువుకొమ్ముపాలేల రోడ్లలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పేరాయపాలెం వద్ద దోర్నపు వాగు, కుంకుపాడు, మోదేపల్లి వద్ద చిలకలేరు, చినకొత్తపల్లి, గోవాడ వద్ద భవనాసి వాగు పొంగి ప్రవహించింది. ఉప్పలపాడు-మైలవరం వద్ద వాగు నీరు రోడ్డు పైకి ప్రవహించింది. ముండ్లమూరు మండలం వేంపాడు వద్ద చిలకలేరుపై రాకపోకలు నిలిచిపోయాయి. అద్దంకి డిపో నుంచి ఒంగోలు, నర్సరావుపేట, విజయవాడ రూట్లలో మినహా మిగిలిన రూట్లలో 50 బస్ సర్వీసులు రద్దు చేశారు. తహసీల్దార్ శ్రీచరణ్, సీఐ సుబ్బరాజులు వాగుల వద్దకు వెళ్లి సిబ్బందికి జాగ్రత్తలు చెప్పారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు.

● **పలు పంటలకు తీవ్ర నష్టం**

భారీ వర్షాలతో పలు రకాల పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన మినుము, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు మొక్కలు పూర్తిగా నీట మునిగాయి. వరికి కొంత మేర నష్టం వాటిల్లింది. పొలాలలో నీరు బయటకు పంపించుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గోవాడ, చినకొత్తపల్లి, ధర్మవరం తదితర గ్రామాలలో పంట పొలాలను మండల వ్యవసాయశాఖ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ పరిశీలించి సూచనలు చేశారు.

● **విద్యుత్ సరఫరాకు అంతరాయం**

అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరగటంతో ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ప్రభుత్వ వైద్యశాల, నర్రావారిపాలెం తదితర ప్రాంతాలలో చెట్లు విరిగి పడటంతో కమిషనర్ రవీంద్ర, కూకట్లపల్లి అటవీశాఖ బీట్ ఆఫీసర్ రమేష్‌ల ఆధ్వర్యంలో తొలగింపు చేశారు.

● **మున్సిపల్ సిబ్బంది, మత్స్యకారుడికి మంత్రి గొట్టిపాటి అభినందనలు**

మత్స్యకారులు తమ ప్రాణాలకు తెగించి గుండ్లకమ్మ వరదలో చిక్కుకున్న మున్సిపల్ సిబ్బందిని కాపాడిన మత్స్యకారుల తీరు అభినందనీయం అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం రాత్రి పలు శాఖల అధికారులతో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై సమీక్షించారు. పంట నష్టం నమోదును జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాపై ఈఈ నల్లూరి మస్తాన్‌రావును అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మినీ బైపాస్ రోడ్డు నిర్మాణంపై అధికారులతో మాట్లాడారు. ఎన్‌టీఆర్ నగర్‌లో మృతి చెందిన హనుమంతరావు, లక్ష్మి ల కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. వరద సమయంలో అధికారులు, సిబ్బంది బాగా పనిచేశారని కొనియాడారు.

చీరాలలో కూలిన వంతెనలు

వాడరేవు - రామాపురం మార్గంలో కూలిన మూడు బ్రిడ్జిలు
రెండు రోజులుగా నిలిచిన విద్యుత్ సేవలు
ఎమ్మెల్యే కొండయ్యతో కలిసి సుడిగాలి పర్యటనలు చేసిన మంత్రులు

చీరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా మొంథా తుఫాన్ కారణంగా నియోజకవర్గం అల్లకల్లోలంగా మారింది. రామాపురం-వాడరేవు రాకపోకలు సైతం బంద్ అయ్యాయి. వాడరేవు గ్రామంలోకి చేరిన వరద నీరు భారీగా పారుతూ సముద్రంలో కలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో 167 ఏ జాతీయ రహదారి జీరో పాయింట్ వద్ద అర్ధరాత్రి చప్టా తెగింది. అక్కడ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే వాడరేవు-రామాపురం మార్గం మధ్యలో శిథిల దశకు చేరిన వంతెన కుప్పకూలింది. రిసార్ట్స్ సమీపంలో మరో వంతెన కూడా అనుకోని రీతిలో కూలిపోవడంతో సమాచారం అందుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ హుటాహుటీన సంఘటన స్థలాలను పరిశీలించారు. బారికేడ్లు ఏర్పాటు చేసిన రెండు గ్రామాలకు సంబంధించిన రాకపోకలు నిలిపివేశారు. తుఫాన్ ప్రారంభం నుంచి అన్ని శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిర్విరామంగా శ్రమించారు. మరోవైపు మగ్గాల్లో సైతం నీళ్లు నిలిచి కార్మికులు అల్లాడారు.

● **మంత్రుల పర్యటన**

ఇదిలా ఉంటే అర్ధరాత్రి నుండే ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ మున్సిపల్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వంగలపూడి అనితలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రక్షణ చర్యలపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉదయం నుండే ముంపు గ్రామాలు, పునరావాస కేంద్రాలు పరిశీలించారు. అలాగే మంత్రులు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్‌లతో కలిసి వాడరేవు, పాపాయిపాలేల్లో పర్యటించారు. ప్రజలకు మంత్రులు భరోసా కల్పించారు. అలాగే పంట, ఆస్తి నష్టంపై అంచనా వేసి సహకారం అందిస్తామని చెప్పారు.



● **రొంపేరు కుడి కాలువను పరిశీలించిన మంత్రి**

రొంపేరు కుడి కాలువలో పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని మంత్రి పార్థసారథి చెప్పారు. తుఫాన్ ప్రభావంతో చీరాల - పర్చూరు మార్గంలోని రొంపేరు కుడి కాలువలో పెద్ద ఎత్తున చెత్త చేరింది. దీంతో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కలిసి కాలువను మంత్రి పరిశీలించారు. మేజర్ కుడి కాలువలో చేరిన చెత్తను సిబ్బంది ద్వారా తొలగింపు చర్యలు చేపట్టారు.

భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు

● **ఎక్కువ నష్టపోయిన కూరగాయలు, మినుము, మొక్కజొన్న రైతులు**

మేదరమెట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ రైతులకు తీవ్రనష్టాన్ని మిగిల్చింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మొక్కజొన్న, మినుము, పత్తి, మిరప, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పి.గుడిపాడు గ్రామంలో మొక్కజొన్న నేల వాలి, కండెలు నాని మొలకలు వస్తున్నాయి. మినుము కూడా నీటిలో ఉండడంతో మొలకలు వచ్చే పరిస్థితి ఏర్పడింది. గుమ్మడి తోట నీటిలో ఉండడంతో ఆకులన్నీ ఎర్రబడి ఎండుముఖం పట్టాయి. మిరప, గోరుచిక్కుడు, బెండ పందిరి తోటల్లో కూడా నీరు నిలిచాయి. ఇక కాకర, పొట్ల, సొర పందిళ్లు పడిపోయాయి. రెండేళ్లుగా పందిరి తోటలు పెంచిన రైతులకు.. పైరు నేలవాలడంతో నష్టానికి అంతులేకుండా పోయింది. మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఖర్చు కాగా పంట చేతికి వచ్చే సమయంలో నేలవాలడంతో ఎకరానికి సుమారు రూ.80 వేలు పైగా నష్టం వాటిల్లింది. అధికారులు దెబ్బతిన్న పంటపొలాలను, కూరగాయల తోటలను బుధవారం మధ్యాహ్నం నుంచి పరిశీలిస్తున్నారు.

● **ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుంది**

మంత్రి రవికుమార్

పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి రవికుమార్ హామీ ఇచ్చారు. బుధవారంరాత్రి పి.గుడిపాడు వచ్చి రైతులను పరామర్శించారు. టార్చిలైట్ల వెలుతురులో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా రైతులకు పరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కూరగాయల రైతులు తమకు జరిగిన నష్టాన్ని మంత్రికి వివరించగా, అధైర్యపడొద్దు.. అండగా ఉంటానని నమ్మకం కలిగించారు.



పీ గుడిపాడులో రాత్రిపూట టార్చి వెలుతురులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి రవి



అద్దంకిలో సమీక్షిస్తున్న మంత్రి గొట్టిపాటి



పాతమాగులూరు ఎస్సీ కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో నీటిని తొలగిస్తున్న సర్పంచ్, అధికారులు



బల్లికురవలో విద్యుత్ స్తంభాలను బిగిస్తున్న సిబ్బంది



బల్లికురవ-మార్టూరు రోడ్డులో వరదకు నిలిచిన రాకపోకలు



తిమ్మాయిపాలెం వద్ద ఉధృతంగా గుండ్లకమ్మ



పంగులూరులో కుప్పకూలిన పెంకుటిల్లు

ఆలయాలు, నివాసాలలో చేరిన వరద నీరు

పంగులూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇంకొల్లు-పంగులూరు ప్రధాన రహదారిలో ఆరికట్లవారిపాలెం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించింది. పంగులూరు, తూర్పుతక్కెళ్లపాడు, జనకవరం, పంగులూరు, కోటపాడు, చందలూరు గ్రామాలలో వాగులు ఉప్పొంగాయి. వరద ఉధృతికి చందలూరు, ఎ.వి.పాలెం, తక్కెళ్లపాడు, కోటపాడు పరిసర గ్రామాలలో వరద ఉధృతి పంట చేలను ముంచేసింది. సోమవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లజాము వరకు సుమారు 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పంట పొలాలు నీటమునిగాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముప్పవరంలోని శివాలయం, పోలేరమ్మగుడి చెరువును తలపించింది. సుమారు 50ఎకరాలలో సాగవుతున్న బెండ, వంగ, దోస తోటలు పూర్తిగా దెబ్బతినగా వరిచేలతో పాటు కొన్నిచోట్ల మిరప, మొక్కజొన్న నీట మునిగాయి. 300 ఎకరాలలో పూత, కాయదశలో ఉన్న పత్తి, వందల ఎకరాల్లో ఉన్న మిరప పంటలకు నష్టం వాటిల్లుతుందని అధికారులు అంచనావేస్తున్నారు.



పంగులూరు-తూర్పుతక్కెళ్లపాడు మధ్య పొంగిప్రవహిస్తున్న ఇసుకవాగు

● **సకాలంలో స్పందించిన అధికారులు**

సంతమాగులూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతమాగులూరు ఎస్సీ కాలనీని వరద ముంచెత్తింది. స్పందించిన గ్రామ సర్పంచి జిర్రా విజయబాబు, తహసీల్దార్ కే రవిబాబు దృష్టికి తీసుకువచ్చారు. బుధవారం ఎక్స్‌కవేటర్ సహాయంతో తహసీల్దార్ దగ్గర ఉండి కాలనీలోని ఏసుక్రీస్తు మందిరం నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న చెరువు కాలువ వరకు గాడి తీయించి నిల్వ ఉన్న వరద నీటిని పంట కాలువలో కలిపారు. దీంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని వసతులు కల్పించామని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రాధిక, గ్రామ కార్యదర్శి షేక్ జానీబాషా పాల్గొన్నారు.

● **చినగంజాంలో...**

చినగంజాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా వరి పొలాలు, ఆక్వా చెరువులు, ఉప్పుకొఠారులు నీట మునిగాయి. మండలంలోని గొనసపూడి గ్రామానికి సమీపంలోని డ్రైనేజీ వాగు, కొమ్మమూరు కాలువ, అప్పేరు వాగు పొంగడంతో గ్రామానికి చుట్టుపక్కల వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. నాగన్న వాగు రావడంతో నీలాయపాలేనికి, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట సమీపంలోని వాగు, ఎన్టీఆర్ వారధి సమీపంలోని మద్రాసు కాలువకు వరద రావడంతో పెదగంజాం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సంతరావూరు-కారంచేడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చెరువులోని చేపలన్నీ వరదనీటికి కొట్టుపోవడంతో నష్టం వాటిల్లినట్లు ఉప్పుతల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. గొనసపూడి, కడవకుదురు ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలను, వరద నీటిని, ఇంకొల్లు, కడవకుదురు ఆర్అండ్‌బీ రహదారిపై నిలిచిన వరదనీటిని జిల్లా ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రెడ్డి, చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. 12 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫారం పడిపోయినట్లు ఏఈ ఎల్.బ్రహ్మం తెలిపారు. చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రంలో ఉన్న గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, డీఐవో డాక్టర్ రత్నమన్మోహన్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో కె.ధనలక్ష్మి, వైద్యాధికారులు పి.సాయిశ్రీచరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రేణింగివరంలో నేలవాలిన మొక్కజొన్న

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

(5వ పేజీ తరువాయి)

జడ్పీటీసీలు విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీపీలపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న కారణంగా ప్రతీకారం తీర్చుకునేందుకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రతిపాదించ బోతున్నట్లు వెల్లడించారు. తమకు 42 మంది సభ్యుల మద్దతు ఉందని ప్రకటించారు. పదవీకాలం కేవలం 11 నెలలు మాత్రమే ఉందని, అంత తక్కువ సమయంలో పదవి మారినా..తాము ఏమీ చేయలేమన్న సంగతి కూడా తెలుసు నని వారు పేర్కొనడం గమనార్హం.

అంతా బాగుంటే కలెక్టర్‌ను కలవాలని

మొంథా తుపాను కారణంగా వైసీపీ జడ్పీటీసీల వ్యూహం దెబ్బ తిన్నట్లు తెలుస్తోంది. వాతావరణం బాగుంటే.. సర్వసభ్య సమావేశం ముగిసిన తర్వాత వైసీపీ జడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మాన లేఖను అందజేయాలని ఆలోచన చేశారు. ఈ విషయాన్ని కొద్దిరోజుల క్రితమే కొందరు లీక్ చేశారు. తుపాను ఆటంకంతో వైసీపీ జడ్పీటీసీల ప్రణాళిక పారలేదు. జడ్పీలో 54 మంది జడ్పీటీసీలున్నారు. ఎన్నికలకు ముందు 12 మంది సభ్యులు టీడీపీ లో చేరారు. ఒక వేళ చైర్‌పర్సన్ మీద అవిశ్వాసం ప్రతిపాదించాలంటే రెండింట మూడోంతుల మంది సంతకాలు చేయాలి. వైసీపీ జడ్పీటీసీలు చెబుతున్నట్లుగా గతంలో 42 మంది మద్దతు ఉండేది కానీ, ఈ మధ్య పూర్తి స్థాయిలో చీలికలు ఏర్పడినట్లు తెలుస్తోంది. మరో 15 మంది సభ్యులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ చెబుతున్నట్లు అవిశ్వాసం సంగతి మొదలు పెట్టకుండానే నవ్వులు పాలు కావచ్చన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

మొంథా బీభత్సం

(5వ పేజీ తరువాయి)

వాగులకు దగ్గరా ఉన్న చేలల్లో అయితే నేలవాలిన వరి పై నుంచి నీరు ప్రవహించింది. దీంతో పొలాల్లోని నీటిని బయటకు తియ్యడానికి రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్రమత్తంగా యంత్రాంగం

ఓ పక్క తుఫాన్ ధాటికి పెనుగాలులు విరుచుకుపడుతుంటే, మరోపక్క చిమ్మచీకటి. వర్షం.. అయినా రోడ్లకు అడ్డుగా విరిగిపడిన చెట్లు, విద్యుత్తు లు స్తంభాలను తొలగించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. చెట్లను పడినట్టే క్షణాల్లో కత్తిరించి పక్కకు తొలగించేశారు. విద్యుత్తు స్తంభాలను పక్కకు నెట్టేసి, అవకాశం ఉన్న వరకు తెగిన తీగలను సరిచేస్తూ రాత్రంతా శ్రమించారు. మరోపక్క పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరాతో పాటు భోజనం, అల్పాహారం అందించారు. ఆరోగ్య సిబ్బంది ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి చికిత్స అందించారు. విద్యుత్ శాఖ ముందే చెట్లను నరికేయడంతో చాలావరకు నష్టం తప్పింది. ప్రధాన లైన్లు దెబ్బతినడంతో లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు 24 గంటల సమయం పట్టింది. నిజాంపట్నం హార్బర్‌లో మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు 8వ ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. బుధవారం ఉదయం నుంచి తుఫాన్ తీవ్రత తగ్గడం, గాలులు శాంతించాయి. దీంతో హార్బర్‌లో హెచ్చరిక తీవ్రతను తగ్గించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా కొన్నిచోట్ల చిరుగాలులు, వర్షం కొనసాగుతుండటం, వాతారణంలో పూర్తిగా మార్పులు రాకపోవడంతో తిరిగి 3వ ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.



యనమదల-అనంతవరం గ్రామాల మధ్య చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు



పర్చూరులో పొంగి పొరలుతున్న వాగులు

అతలాకుతలం!



ఉప్పుటూరు బ్రిడ్జిపై భారీగా ప్రవహిస్తున్న వరద నీరు

జలదిగ్బంధంలో పర్చూరు

పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలు

స్తంభించిన రాకపోకలు

శివారు కాలనీలు, గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

వేల ఎకరాల్లో మండెలుగా నిల్వచేసిన నల్లబర్లీ మునక

నీటిలో పంట పొలాలు

విద్యుత్ సరఫరా లేక అంధకారంలో గ్రామాలు

ఆందోళనలో అన్నదాతలు, ప్రజలు

పర్చూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూలేని విధంగా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు పర్చూరు జలదిగ్బంధంలో చిక్కుకుంది. కుండపోతతో కురిసిన వర్షంతోపాటు, ఈదురుగాలులు, నివాసాల చుట్టూ వరద నీరు కమ్మేయటంతో ప్రజలు భయపడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిపివేయటంతో చిమ్మచీకట్లో ప్రజలు మగ్గిపోయారు.

● వరద నీటిలోనే ప్రభుత్వ కార్యాలయాలు

వాగులు, కాలువలు పొంగి పొర్లడంతో తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఉప్పుటూరులోని ఎస్సీ బాలికల వసతి గృహం సైతం జలదిగ్బంధంలో నిలచిపోయింది.

● నీట మునిగిన విద్యుత్ సబ్‌స్టేషన్లు

పర్చూరు - ఇంకొల్లు రోడ్డులోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో భారీగా నీరు చేరి నీట మునిగింది. అదేవిధంగా వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రోడ్డులోని పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం సమీపంలోని 220 కేవీ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను సైతం వరద ముంపుకు గురైంది.

● నలు దిక్కులా జలదిగ్బంధం...

పర్చూరుకు నలుదిక్కుల నుంచి రాకపోకలు స్తంభించాయి. పర్చూరు - గుంటూరు - చిలకలూరిపేట వైపు వెళ్లే రహదారిలో నేల చప్టాపై పెద్ద ఎత్తున వరద నీరు చేరింది. అదేవిధంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఉప్పుటూరు వాగుపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై నుండి వరద నీరు పొంగి పొర్లడంతో ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించే అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నాగులపాలెం గ్రామాన్ని పూర్తిగా వరద నీరు కమ్మేసింది.

యద్దనపూడి గ్రామానికి రాకపోకలు బంద్

యద్దనపూడి,(మార్టూరు) అక్టోబరు29(ఆంధ్రజ్యోతి) : తుపాన్ యద్దనపూడి మండలాన్ని అతలాకుతలం చేసింది. బుధవారం ఉదయానికి కూడా మండల కేంద్రమైన యద్దనపూడి చేరడానికి నాలుగుదిక్కుల నుంచి అవకాశం లేకుండా పోయింది. యద్దనపూడి నుంచి పర్చూరు వెళ్లాలంటే నేలచప్టాలపై ప్రవహిస్తున్న వర్షపునీరు, మార్టూరు రావాలంటే డేగరమూడి వాగు,చిలకలూరిపేట వెళ్లాలంటే అనంతవరం రోడ్డులో నేల చప్టా, గన్నవరం వెళ్లాలంటే రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం, కూలిన చెట్లతో రాకపోకలు ఆగిపోయాయి. పోలూరు వాగు వద్ద పోలీస్ రెవెన్యూ అధికారులు ప్రజలను రానివ్వకుండా విధులు నిర్వహిస్తున్నారు. వింజనంపాడు రోడ్డులో ఉన్న నేల చప్టా వద్ద రాకపోకలు స్తంభించాయి. చిమటావారిపాలెం నుంచి యద్దనపూడి రావడానికి కూడా మధ్యలో నేల చప్టాపై విపరీతంగా నీరు ప్రవహించడంతో రవాణా సౌకర్యం నిలిపోయింది. తహసిల్దారు రవికుమార్, ఎస్ఐ రత్నకుమారి, ఇతర శాఖలకు చెందిన అధికారులు నష్టనివారణను తగ్గించేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు.

మార్టూరులోనూ ముంపు

మార్టూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ నుంచి ప్రజలకు అండగా నిలబడటంలో మండలంలోని అధికార యంత్రాంగం తీవ్రంగా కృషి చేసింది. మార్టూరు నుంచి రాజుగారిపాలెం, డేగరమూడి గ్రామాలకు వెళ్లడానికి రాకపోకలు స్తంభించాయి. రాజుగారిపాలెం వాగు తూముల చప్టాపై నుంచి 5 అడుగులు మేర వరద నీరు ప్రవహించడం, వాగుకు ఎగువన వరదనీరు గ్రామంలోని ప్రవేశించి దాదాపు 10 ఎస్‌టీ కుటుంబాలకు చెందిన ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. మార్టూరు-డేగరమూడి వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోనంకి గ్రామంలో ఫ్లైవోవరుకు పడమర వైపు ఉన్న బీసీ కాలనీలోకి భారీగా వరదనీరు చేరడం, అంతేగాకుండా సర్వీసు రోడ్డులో భారీగా వర్షపునీళ్లు నిలబడటంతో దాదాపుగా 70 కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. వారందరికీ కోనంకి గ్రామ టీడీపీ మహిళా నాయకురాలు కోటపాటి కోమలి భోజన ఏర్పాట్లు చేశారు. రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద లారీడ్రైవర్లు, క్లీనర్లకు ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషాలు రెవెన్యూ వారి సహకారంతో భోజనం అందించారు. జొన్నతాళి గ్రామంలో జగనన్న కాలనీలో భారీగా వర్షపునీళ్లు చేరాయి. మార్టూరులో గ్రామ పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు హైవే వారి సహకారంతో సర్వీసురోడ్లలో సైడు కాలువలు పూడికతీత తీయడంతో పెద్ద అండరుపాస్ వద్ద నీళ్లు నిలబడకుండా పోయాయి.

● నష్టపోయిన పంటలు

తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాలలో కూరగాయలు దాదాపుగా 475 ఎకరాలలో పంట దెబ్బతిన్నట్లు ఉద్యానాధికారులు నివేదికను తయారుచేసి పంపించారు. ఇంకా మినుము, పత్తి, తెల్లబర్లీ పంట సాగు చేసిన రైతులు నష్టపోయారు. రాజుగారిపాలెంలో కోతకు వచ్చిన వంద ఎకరాలు మొక్కజొన్న పంట నష్టానికి గురైనట్లు రైతులు తెలిపారు.

శభాష్ ఇంకొల్లు ఎస్సై

ఇంకొల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలం కొణికిపల్లికు చెందిన టి.కీర్తి పురిటి నొప్పులతో బాధపడుతుండగా వరద నేపథ్యంలో 108 అక్కడకు వెళ్లే పరిస్థితి లేదు. సమాచారం అందుకున్న ఎస్సై సురేష్ హుటాహుటిన అక్కడకు చేరుకొని తమ వాహనంలో ఇంకొల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఎస్సై సురేష్, వైద్యురాలు అంజలిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు.



ముంపు ప్రాంతాల్లో మంత్రి పార్థసారథి, కలెక్టర్ వినోద్ కుమార్



పర్చూరు ప్రాంతంలో నీట మునిగిన పత్తి పైరు

అధికారులు సమన్వయ చర్యలతో నష్టనివారణ

బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలసి వరద ప్రాంతాల పరిశీలన

పర్చూరు/కారంచేడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పనిచేసి మొంథా తుపాన్ ప్రభావం నుంచి ప్రజల ప్రాణహానితో పాటు, ఆస్తినష్టం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి కొనియాడారు. బుధవారం చీరాల నుంచి పర్చూరు మార్గంలోని కారంచేడు రొంపేరు కుడి మేజర్ కాలువను, పర్చూరు వాగు ప్రవాహన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలసి సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్చూరు వాగు ఊహించని రీతిలో ప్రవహిస్తూ, పర్చూరు, నాగులపాలెంను ముంచెత్తిందన్నారు. ఈ వాగు సామర్థ్యం 5500 క్యూసెక్కులు మాత్రమేనని, పల్నాడు, చిలకలూరిపేట, అద్దంకిలో కురిసిన వర్షం కారణంగా వాగులో 9 నుంచి 11 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని చెప్పారు. సకాలంలో అధికారులు స్పందించకపోతే పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెంకు అపారనష్టం జరిగేదన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ ఉమామహేశ్వరరావు, డ్రైనేజ్ శాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

విపత్కర సమయాల్లో సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : విపత్కర సమయాల్లో ఇతరులకు సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. తుఫాన్ కారణంగా మండల పరిధిలోని దేవాంగపురిలో నీట మునిగిన ఇళ్లను ఎమ్మెల్యే కొండయ్య పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ఆదుకుంటామని చెప్పారు. అలాగే బట్ట మోహన్‌రావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరాశ్రయులైన 150 మందికి అన్నదానం నిర్వహించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పవనపుత్ర హ్యాండ్‌లూమ్స్ ప్రతినిధులు, టీడీపీ నాయకులు వెంగల భరత్ దేశాయిపేటలోని శారదానగర్ కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, యానాది కాలనీ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీళ్ల చేరి ఇబ్బందులు పడుతున్న వారికి భోజనం పంపిణీ చేశారు. చల్లారెడ్డిపాలెం పరిధిలోని జగన్నాధపురంలో దోగుపర్తి బాలకృష్ణ సుమారు 80 మందికి భోజనం పంపిణీ చేశారు.



అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైల్వేఉద్యోగులను కాపాడిన చినగంజాం పోలీసులు



రైల్వే ట్రాక్‌మెన్‌ను రక్షించిన పోలీసులు

చినగంజాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వరద నీటిలో కొట్టుకుపోతున్న ఇద్దరు రైల్వే ట్రాక్‌మన్లను చినగంజాం పోలీసులు ప్రాణాలకు తెగించి కాపాడారు. తుఫాన్ ప్రబావంతో పెదగంజాం, నీలయాపాలెం మధ్య నాగన్న వాగు పొంగింది. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌మన్లుగా పనిచేస్తున్న గణేష్, బాలాజీరెడ్డిలు విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇళ్లకు బయలుదేరారు. నాగన్నవాగు బైక్‌పై ముందుకు వెళ్తుండగా నీటి ప్రవాహానికి ఇద్దరు కొట్టుకుపోతుండగా సమీపంలో విధులు నిర్వహిస్తున్న చినగంజాం పోలీసులు అన్వర్‌బాషా, హోంగార్డు శివశంకర్‌రెడ్డిలు తమ ప్రాణాలకు తెగించి తాళ్ల సాయంతో ఇద్దరిని రక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ తీరం దాటిన తరువాత పోలీసు యంత్రాంగం సహాయ చర్యలు ముమ్మరంగా చేస్తున్నారని, ఏదైనా ఆపద వస్తే తక్షణమే స్పందిస్తున్నారని తెలిపారు. కానిస్టేబుళ్లను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు, చీరాల డీఎస్పీ మొయిన్, ఇంకొల్లు సీఐ వైవీ.రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్‌లు అభినందించారు.



ముంపుబాధితులకు అన్నం వడ్డిస్తున్న ప్రతినిధులు

సహాయక చర్యల్లో తెలుగుదేశం పార్టీ నేతలు

స్వర్ణ(పర్చూరు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రాలకు స్థానిక అధికారులతో కలసి ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్, మండల పార్టీ అధక్షుడు తిరుమలశెట్టి శ్రీహరి నేతృత్వంలో సహాయక చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు.. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అదేవిధంగా పర్చూరు ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు మామిడిపాక హరిప్రసాద్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



పర్చూరు రోడ్డులో వాగువద్ద భద్రతా ఏర్పాట్లలో సీఐ వైవి రమణయ్య



వంకాయలపాడు వద్ద ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు చేరుస్తున్న ఎస్సై

చెరువులను తలపించిన పంటపొలాలు

ఇంకొల్లు, అక్టోబరు 29, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు మండలంలో పంటపొలాలు చెరువులను తలపించాయి. అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయడంతో ప్రాణ, ఆస్తినష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సీఐ రమణయ్య పర్యవేక్షణలో ఎస్సై సురేష్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాసరావు తమ సిబ్బందితో సమన్వయం చేసుకొని విధులు నిర్వహించారు. మొత్తం 14 సచివాలయాల పరిధిలో 14 పురావాసకేంద్రాలు ఏర్పాటు చేయగా వంకాయలపాడులో 150 మందిని ,గంగవరం తదితర గ్రామాలో 150 మందిని పునరావాస కేంద్రాలలో ఉంచగా వారికి అధికారులు భోజనవసతులను ఏర్పాటుచేశారు.

మొక్కజొన్న, పత్తికి ఇబ్బంది

మండల పరిధిలోని పాత మద్రాసురోడ్డులో దుద్దుకూరు వద్ద వాగు రెండు రోజులుగా పొంగి ప్రవహిస్తోంది.రాకపోకలు నిలిచిపోయాయి. పూసపాడు-వంకాయలపాడు వద్ద వాగు పొంగి ప్రవహించింది. ఎస్సై సురేష్. నీటిలో చిక్కుకున్న 50 మందిని ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. ఇంకొల్లు-దగ్గుబాడు మధ్య ఆలేరు వాగు వంతన మీద రెండు అడుగుల ఎత్తున, గంగవరం రోడ్డులోని అప్పేరు వాగు, నాగండ్లకు ఇరువైపులా ఉన్న రెండు వాగులు పొంగి ప్రవహించాయి. దుద్దుకూరు చెరువుకట్ట కోతకు గురైంది. వాగుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బందోబస్త్ ఏర్పాటు చేశారు. పత్తి పంట నీటి మునిగింది. కండె దశలో ఉన్న మొక్కజొన్న పంట నేల పాలైంది.

ద్రోణాదులలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న మినుము

మార్టూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో దాదాపు 500 ఎకరాల్లో మినుము పంట దెబ్బతింది. అదేవిధంగా గ్రామంలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ద్రోణాదుల గ్రామం నుంచి బొబ్బేపల్లికి వెళ్లే రోడ్డులో ఉన్న చప్టాపై ఉధృతంగా వర్షపు నీరు ప్రవహించడంతో సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

హైవేను పగులకొట్టించిన కలెక్టర్

పర్చూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పర్చూరు ప్రాంతాన్ని వరద నీరు చుట్టుముట్టాయి. వరద ఉధృతి పెరిగి గ్రామాలను ముంచెత్తుతున్నాయన్న విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ స్పందించారు. హుటాహుటినా పర్చూరు ప్రాంతంలో చేపట్టిన జాతీయ రహదారి 167(ఏ)లో భాగంగా ఉప్పుటూరు సమీపంలో హైవేను పగులకొట్టి వరదను దిగువకు మళ్లించారు. కలెక్టర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దిగువకు చేరిన నీరు ఆయా పంట పొలాల నుంచి కొమర్నేనివారిపాలేనికి పెద్దఎత్తున చేరటంతో గ్రామస్థులు కలవరానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● కొరవడిన హైవే అధికారుల ముందు చూపు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో అధికారుల్లో ముందుచూపు కొరవడడం ప్రజలకు శాపంగా మారింది. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతుండడంతో సమస్య తీవ్రంగా మారింది. హైవే నిర్మాణంలో ఖానాలను ఏర్పాటు చేయక పోవటంతో పాటు, డ్రెయిన్లను నిర్మించకపోవటంతో వరద నీరు గ్రామాలను ముంచెత్తింది. నలు దిక్కుల నుంచి దిగువకుపోయే మార్గం లేక గ్రామాలను ముంపుకు గురిచేశాయని ప్రజలు వాపోతున్నారు. కేవలం కొద్దిపాటి తూములను మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవటం వల్లే తమకు ఇలాంటి దుస్థితి నెలకొందని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

● రాజుగారిపాలెం వాగులో టెన్షన్

మార్టూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్‌తో మండలంలోని రాజుగారిపాలెం వాగు చప్టాపై నుంచి బుధవారం భారీగా వరదనీరు ప్రవహించడమేగాకుండా, చెత్తా చెదారం, వ్యర్థాలతో చప్టా తూములు మూసుకుపోయాయి. ముంపును గ్రహించిన గ్రామ టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు ఆగమేఘాల మీద ఎక్స్‌వేటర్‌ను తెప్పించి, వాగు వద్ద చెత్తను తొలగించారు. కొంచెం సేపు పని చేసిన తర్వాత ఎక్స్‌వేటరు ఇంజన్ సక్రమంగా పనిచేయక, వాగు నీటిలో చిక్కుకుపోయింది. అత్యవసరంగా ఎస్కార్ట్ వాహనాన్ని తెప్పించి నీటిలో ఉన్న ఎక్స్‌వేటరును చీకటి పడుతున్న సమయానికి బయటకు తీయించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



వాగులో ఇరుక్కుపోయిన ఎక్స్‌వేటర్‌ను తీస్తున్న ఎస్కార్ట్ వాహనం